epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి: 19 | సంచిక: 199 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 29 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

## ప్రతీ పౌరుడికి యూఐఎన్

### 'యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డ్'

ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య

అన్ని సంక్షేమ పథకాల లబ్ధి ఒకే కార్డులో లభ్యమయ్యేలా విప్లవాత్మక నిర్ణయం

2



## ఇందిరమ్మ స్ఫూర్తి.. ఎన్టీఆర్ ఆదర్శాలతో

# ప్రజాపాలన

## తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం



- 30 వేల ఎకరాల్లో 'ఇండియా ఫ్యూచర్ సిటీ'
- ఎన్టీఆర్ రూ.2 కే కిలో బియ్యం స్ఫూర్తితోనే రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ
- స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో మద్దతిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రాష్ట్రంలోని ప్రతి పౌరుడు పొందుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డు) రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్డు ద్వారా ప్రతి వ్యక్తి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేరకు లబ్ధి పొందుతున్నారో స్పష్టంగా తెలుసుకునే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా చర్చించారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

.. వివరాలు 2లో

## వర్చువల్‌గా మహానాడు

# ట్రెండ్ సెట్టర్!

### ముగింపు సభలో సీఎం చంద్రబాబు నాయుడు

- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కితాబు
- సీఎం అంటే కామన్ మ్యాన్ అంటూ వ్యాఖ్య
- మహానాడులో 16 లక్షల 75 వేల మంది హాజరు
- తెరచాటు పాలనకు స్వస్తి.. ప్రజాపాలను శ్రీకారం



5

## చల్లని కబురు

### రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది.

2 లో



## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

.. వివరాలు 4లో



## పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ

.. వివరాలు 4లో

## పిడుగుపాటుకు రైతుగా మారిన టెకీ హఠాన్మరణం

.. వివరాలు 4లో

## అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే

# దారుణం

### యువతిపై ఐదుగురు నేపాలీల దాడి

- చేయి పట్టి లాగుతూ అసభ్య ప్రవర్తన..
- ధైర్యంగా కేకలు వేసిన బాధితురాలు
- నిందితులను పట్టుకున్న స్థానికులు..
- నడిరోడ్డుపైనే దేహశుద్ధి
- అబిడ్స్ పోలీసులకు అప్పగింత..
- నిందితులంతా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కార్మికులు
- సీసీఎస్ ఆఫీస్ ముందే ఘటన జరగడంపై నగరంలో తీవ్ర కలకలం




.. వివరాలు 2లో



## భారత అంతరిక్ష రంగంలో

# సరికొత్త చరిత్ర

- స్వదేశీ పునర్వినియోగ రాకెట్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!
- హైదరాబాద్‌కు చెందిన 'అబ్యోమ్ స్పేస్‌టెక్' స్టార్టప్ అరుదైన రికార్డు
- మళ్లీ మళ్లీ వాడుకునేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజిన్ రూపకల్పన

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. నగరానికి చెందిన అబ్యోమ్ స్పేస్ టెక్ అండ్ డిఫెన్స్ స్టార్టప్, దేశంలోనే తొలి పూర్తి స్థాయి స్వదేశీ పునర్వినియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మే 27 బుధవారం నాడు మేడ్చల్– మల్కాజ్గిరి జిల్లాలోని శామీ–ర్‌పేటలో ఉన్న కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీ వద్ద ఈ పరీక్షలు జరిగాయి.

మిగతా 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు

# కట్టుబడండి

- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవావల్‌పై కేటీఆర్ ప్రతిసవాల్
- 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామన్న మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?

3



## సబ్బండ వర్గాల గతి మార్చేలా ప్రణాళిక

3

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





# చల్లని కబురు

## రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం

**హైదరాబాద్, మే28 :** తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# హార్మూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

## చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం: ట్రంప్

## ఇరాన్ అణ్వాయుధాలపై అమెరికా కఠిన హెచ్చరికలు

**మాస్కో:** ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగుతున్నాయని చెబుతూనే అమెరికా మరోవైపు సైనిక చర్యలను ముమ్మరం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ హార్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హార్మూజ్ ప్రాంతంలో అమెరికా బలగాలకు ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా దాడులు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామని హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, అయితే తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు.. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న ప్రయత్నం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదన్నారు. "ఇప్పటివరకు సంతృప్తిగా లేం.. కానీ చివరికి అవుతాం" అని వ్యాఖ్యానించారు.

### హార్మూజ్‌పై కీలక వ్యాఖ్యలు

హార్మూజ్ జలసంధి అంతర్జాతీయ జలమార్గమని, దానిని ఏ దేశం స్వంతంగా నియంత్రించలేదని ట్రంప్ పేర్కొన్నారు. "హార్మూజ్ అందరికీ తెరిచి ఉంటుంది. మేము పర్యవేక్షిస్తాం కానీ దానిపై ఎవరికీ పూర్తి నియంత్రణ ఉండదు" అని తెలిపారు. ఇదే అంశం ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో కీలక భాగమని వెల్లడించారు. ఒమన్‌కు కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. హార్మూజ్ చర్చల్లో ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "ప్రపంచంలోని ఇతర దేశాల్లాగే ఒమన్ కూడా ప్రవర్తించాలి. లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని ఘాటుగా స్పందించారు.

### తాత్కాలిక ఒప్పందం కథనాలు.. ఖండించిన వైట్ హౌస్

అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంచలన కథనాలు ప్రసారం చేసింది. యుద్ధ పరిస్థితులను తగ్గించే దిశగా రెండు దేశాలు ముందడుగు వేసాయని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా గల్ఫ్ ప్రాంతం నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని, హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు 30 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటాయని వెల్లడించింది. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల పర్యవేక్షణను ఇరాన్, ఒమన్ సమన్వయంతో నిర్వహిస్తాయని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా ఖండించింది. "ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలోని మీడియా ప్రచారం చేస్తున్న కథనాలు అబద్ధాలు. అవగాహన ఒప్పంద ప్రచారం కల్పితం" అని వైట్‌హౌస్ స్పష్టం చేసింది.

### దౌత్య మార్గానికే ప్రాధాన్యం: రూబియో

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికా ఇప్పటికీ దౌత్య చర్చలకే ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. "దౌత్య చర్చలే ఎప్పుడూ మొదటి ఎంపిక. ఒప్పందం కుదిరే అవకాశం ఉంటే మేము సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. ఇటీవల జరిగిన చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని, రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత స్పష్టమవుతుందని పేర్కొన్నారు. అయితే చర్చలు విఫలమైతే అమెరికాకు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని రూబియో హెచ్చరించారు. అమెరికా భద్రతా ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అయినప్పటికీ యుద్ధం కంటే చర్చల ద్వారానే పరిష్కారం కోరుకుంటున్నామని తెలిపారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ప్రస్తుతం హార్మూజ్ జలసంధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలక మార్గంగా ఉంది. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే భారీ స్థాయి ముడి చమురు, సహజ వాయువు రవాణా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ చమురు ధరలపై తక్షణ ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్–అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత అస్థిరతకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు చర్చలు, మరోవైపు సైనిక హెచ్చరికలు కొనసాగుతుండటంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఇందిరమ్మ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆదర్శాలతో ప్రజాపాలన

- తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం
- 30 వేల ఎకరాల్లో 'ఇండియా ఫ్యూచర్ సిటీ'
- ఎన్టీఆర్ రూ.2 కే కిలో బియ్యం స్ఫూర్తితోనే రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ
- స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో మద్దతిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



**హైదరాబాద్, మే28:** ఉక్కుమహిళ ఇందిరాగాంధీ, తెలుగు జాతి గర్వకారణం నందమూరి తారకరామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశ చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలనుకునే ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి మహానేతలను స్మరించుకోవాలని అన్నారు. దేశం ఉన్నంత కాలం వారి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కుల, మత, భాషలకు అతీతంగా నైతికత, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జీవితాంతం గుర్తుండిపోయే మధుర ఘట్టమని అన్నారు. తెలంగాణకు చెందిన అనేక మంది నాయకులకు రాజకీయ భిక్ష పెట్టిన నేత ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

### హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర అభివృద్ధి దిశగా అనేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను భవిష్యత్‌లో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 30 వేల ఎకరాల్లో ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఫ్యూచర్ సిటీ' నిర్మాణం చేపట్టడమే కాకుండా ప్రపంచ దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకురానున్నామని వెల్లడించారు. తెలంగాణ యువతను ఉద్యోగులుగానే కాకుండా భారీ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

### ఎన్టీఆర్ సంక్షేమ పథకాలే స్ఫూర్తి

రాష్ట్రంలో 3.24 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ.2 కిలో బియ్యం పథకం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఎన్టీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల స్ఫూర్తితోనే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. జనతా వస్త్రాల పథకం స్ఫూర్తితో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపడుతున్నామని వివరించారు. ఇందిరమ్మ ఆశయాలు, ఎన్టీఆర్ ఆదర్శాలు ప్రజాపాలనలో ప్రతిబింబిస్తున్నాయని సీఎం అన్నారు. ఇందిరమ్మ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ ఇద్దరు మహానేతల స్ఫూర్తితోనే ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో ఎన్టీఆర్ పాత్రను గుర్తు చేసిన సీఎం.. అదే స్ఫూర్తితో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే ప్రజాపాలన ముందుకు సాగుతోందని, భవిష్యత్‌లో కూడా అదే విధంగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఎన్టీఆర్ కుమారులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పౌరుడికి యూఐఎన్

- ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- అన్ని సంక్షేమ పథకాల లబ్ధి ఒకే కార్డులో లభ్యమయ్యేలా విప్లవాత్మక నిర్ణయం
- లబ్ధిదారుల డేటా సేకరణకు తక్షణమే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులకు ఆదేశం
- ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్.. పారదర్శకత పెంచడమే ఏకైక లక్ష్యం
- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్, పెన్షన్లు, సర్వే వివరాలన్నీ ఒకే చోట అనుసంధానం
- వలసలపై కేరళ విధానాల అధ్యయనం..
- అనధికార ఏజెంట్లకు చెక్ పెట్టేలా చర్యలు
- ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే28:** రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న అన్ని సంక్షేమ పథకాల వివరాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ 'సమగ్ర సంక్షేమ కార్డు (యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డ్)' రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత లబ్ధి చేకూరుతుందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సమాచారాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో విశ్లేషించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని, తద్వారా నిజమైన అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతూనే, అనర్హులను సులభంగా గుర్తించవచ్చని అభిప్రాయపడ్డారు. వేర్వేరు పథకాలకు వేర్వేరు కార్డులు ఇచ్చే పాత పద్ధతికి స్వస్తి పలికి, ఐటీ శాఖ పర్యవేక్షణలో ఈ ఒకే ఒక సమగ్ర కార్డును తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న, క్రియాశీలక యువ అధికారులను వినియోగించుకోవాలని చెప్పారు.

### రాష్ట్ర స్థాయి వినూత్న గుర్తింపు సంఖ్య:

ఈ స్మార్ట్ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఫీజు రీయంబర్స్ మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ పరిధిలోని పథకాలతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల బీమా పథకాల వివరాలను పొందుపరచాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే జాతీయ స్థాయిలో ఉన్న ఆధార్ నంబర్ తరహాలోనే, రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక వినూత్న గుర్తింపు సంఖ్యను (ఖఅఱనబవ ×సవత్ఞ్ఎ చీబఎఎవతీ) కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుకు అనుసంధానం చేయాలన్నారు. సంక్షేమ లబ్ధిదారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.

### ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ - తక్షణ అప్‌డేట్:

ఈ విధానంలో ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దీని ప్రకారం, రాష్ట్రంలో ఎక్కడైనా ఒక పౌరుడి మరణ ధృవీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్) జారీ కాగానే, ఆ సమాచారం తక్షణమే పెన్షన్ డేటాబేస్‌కు చేరిపోవాలని, దానికి అనుగుణంగా తదుపరి చర్యలు వెంటనే జరగాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను కూడా ఈ సమగ్ర కార్డుతో లింక్ చేయాలని ఆదేశించారు.

### గల్ఫ్ వలసదారులకు భరోసా:

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ కోసం కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు పాస్‌పోర్ట్, వీసా జారీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెస్తే, అమాయక కార్మికులను మోసం చేసే అనధికార ఏజెంట్ల ప్రమేయాన్ని పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అంచనా వేయడానికి ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఒక దిక్సూచిలా పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర

## పునర్వియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ పరీక్షను విజయవంతం

## అబ్యోమ్ స్పేస్‌టెక్, స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన

**హైదరాబాద్, మే 28:** భారత అంతరిక్ష పరిశోధన రంగంలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. నగరానికి చెందిన అబ్యోమ్ స్పేస్ టెక్ అండ్ డిఫెన్స్ స్టార్టప్, దేశంలోనే తొలి పూర్తి స్థాయి స్వదేశీ పునర్వినియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మే 27 బుధవారం నాడు మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్‌పేటలో ఉన్న కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీ వద్ద ఈ పరీక్షలు జరిగాయి. సాధారణంగా రాకెట్ ఇంజిన్లను ఒకసారి వాడిన తర్వాత అవి పనికిరాకుండా పోతాయి. కానీ, అబ్యోమ్ స్పేస్ టెక్ అభివృద్ధి చేసిన ఈ ఇంజిన్ మళ్లీ మళ్లీ వాడుకోవడానికి వీలుగా రూపొందించారు. ఈ స్టార్టప్ తన సొంత సాంకేతికతతో, ఎవరి సాయం లేకుండా ఫ్లైట్ రెడీ క్రయోజెనిక్ ఇంజిన్, హోప్ వీటీవీఎల్ పునర్వినియోగ రాకెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ మైలురాయిని అధిగమించింది. పునర్వినియోగ రాకెట్ల వల్ల అంతరిక్ష ప్రయోగాల వ్యయం భారీగా తగ్గుతుంది. ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్, డేటా సేకరణ వ్యవస్థలు ఇలా అన్నీ మన దేశంలోనే, అబ్యోమ్ శాస్త్రవేత్తల చేతుల్లోనే రూపొందాయి. విదేశీ సాంకేతికతపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది కేవలం పౌర అవసరాలకే కాకుండా రక్షణ రంగంలో కూడా వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తుంది. బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లోని టెక్నాలజీ బిజినెస్



ఇంక్యుబేటర్‌లో ఈ స్టార్టప్ రూపుదిద్దుకుంది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో జైనల్ అబిదీన్ తెలిపిన వివరాల ప్రకారం ఇది కేవలం ఒక ఇంజిన్ పరీక్ష మాత్రమే కాదని, భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థ నిర్మాణానికి ఇది బలమైన పునాది అని అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవావల్‌పై కేటీఆర్ ప్రతిసవాల్
- 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామన్న మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?



**హైదరాబాద్, మే 28:** సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సబ్బండ వర్గాల గతి మార్చేలా ప్రణాళిక

- సింగరేణి, ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా మోసం చేస్తోంది
- ఆరేళ్ల క్రితం 20 వేలు అడిగి.. సీఎం అయ్యాక 16 వేలు ఇస్తారా? కనీస వేతనాలపై నయవంచన
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం
- తెలంగాణ రక్షణ సేనలో చేరిన మాజీ మంత్రి బోడ జనార్ధన్.. గులాబీ కండువా కప్పిన కవిత



**హైదరాబాద్, మే 28:** రాష్ట్రంలోని సబ్బండ తెలంగాణ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేలా సరికొత్త విప్లవాత్మక అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తన భారీ అనుచరవర్గంతో కలిసి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. బంజరాహిల్స్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్దన్ చేరికతో పార్టీకి మైలేజ్ పెరగడమే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేసిన జనార్ధన్‌కు పార్టీలో తగిన ప్రాధాన్యత, గౌరవం ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ఒరవడి సృష్టించేందుకు, సమసమాజ స్థాపన కోసమే తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించిందని కవిత పేర్కొన్నారు. త్వరలోనే తాము ప్రకటించబోయే సంక్షేమ ప్రణాళిక తెలంగాణ సమాజంలో పెను మార్పులు తెస్తుందన్నారు. "కొంతమంది కేవలం ప్రశ్నిస్తారు.. మరికొందరు పోరాటం చేస్తారు. కానీ మా పార్టీ సమస్యను ప్రశ్నించి, పోరాడి, పరిష్కరించే వరకు వదిలిపెట్టదు" అని స్పష్టం చేశారు. తమ 'జనం బాట' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వల్లే ఇప్పటికే 25 ప్రధాన సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై తాము గళమెత్తడం వల్లే సీఎం రివ్యూ చేశారని, అలాగే నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాట ద్వారా ప్రస్తావించడంతోనే ప్రభుత్వం పనులు ప్రారంభించిందని కవిత వివరించారు. రాష్ట్రంలోని సింగరేణి, ఆర్టీసీ సహా అన్ని రంగాల కార్మికులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా మోసం చేస్తున్నారని కవిత ఆరోపించారు. కనీస వేతనాలు (మినిమమ్ వేజెస్) ఫిక్స్ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నప్పుడు కార్మికులకు రూ. 20 వేల కనీస వేతనం ఇవ్వాలని నాటి సీఎంకు లేఖ రాశారని గుర్తు చేశారు. తీరా తనే ముఖ్యమంత్రి అయ్యాక, ఆరేళ్ల తర్వాత ఆ వేతనాన్ని రూ. 16 వేలకు తగ్గించి ఇవ్వడం కార్మికులను నయవంచనకు గురిచేయడమేనని మండిపడ్డారు. సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, గతంలో సాధించుకున్న డిపెండెంట్ ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఊడబీకే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ఐఎన్‌టీయూసీ హయాంలో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, బోడ జనార్ధన్ చేరికతో తమ హెచ్‌ఎంఎస్ (ఎమీా) యూనియన్‌కు సింగరేణిలో మరింత బలం చేకూరుతుందని, కార్మికుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను కూడా తీవ్ర అన్యాయానికి గురిచేసిందని కవిత విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై మొద్దునిద్ర పోయారని, డ్రైవర్ రాజు గౌడ్ బలిదానం చేసుకునే వరకు ఈ ప్రభుత్వానికి చలనం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోలుపై ప్రశ్నించిన ఒక ఆర్టీసీ డ్రైవర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తే, తాము పెద్ద ఎత్తున పోరాటం చేయడం వల్లే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, రాష్ట్రంలో ప్రశ్నిస్తే తట్టుకోలేని కర్కశ పాలన సాగుతోందని మండిపడ్డారు.

### కవిత విజన్‌కు ఆకర్షితుడినై పార్టీలో చేరా

ఒక మహిళా నాయకురాలు సొంతంగా పార్టీ పెట్టి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి బోడ జనార్దన్ కొనియాడారు. "గతంలో ఎన్టీఆర్ గారు కూడు, గూడు, గుడ్డ నినాదంతో వస్తే.. కేసీఆర్ గారు నీళ్లు, నిధులు, నియామకాలతో వచ్చారు. కానీ కవిత గారు 'పాంచజన్యం' పేరుతో ఐదు కీలక అంశాలను తెరపైకి తెచ్చి ఆ ఇద్దరు మహానాయకుల కంటే ఉన్నతంగా ఆలోచించారు" అని ప్రశంసించారు. కవిత ప్రకటించిన మేనిఫెస్టో నచ్చుడం వల్లే తాను టీఆర్ఎస్‌లో చేరుతున్నానని, తెలంగాణకు మహిళ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఇకపై కాంగ్రెస్ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బోడ జనార్దన్ స్పష్టం చేశారు.

# అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే దారుణం

- యువతిపై ఐదుగురు నేపాలీల దాడి!
- చేయి పట్టి లాగుతూ అసభ్య ప్రవర్తన.. ధైర్యంగా కేకలు వేసిన బాధితురాలు
- పరుగులు తీసి నిందితులను పట్టుకున్న స్థానికులు.. నడిరోడ్డుపైనే దేహశుద్ధి
- అబిడ్స్ పోలీసులకు అప్పగింత.. నిందితులంతా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కార్మికులుగా గుర్తింపు
- సీసీఎస్ ఆఫీస్ ముందే ఘటన జరగడంపై నగరంలో తీవ్ర కలకలం



**హైదరాబాద్, మే 28 :** భాగ్యనగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిలయమైన పోలీస్ కార్యాలయం ముందే ఓ ఒంటరి యువతిపై దుండగులు తెగబడ్డారు. బుధవారం అర్ధరాత్రి బషీర్ బాగ్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఆఫీస్ ఎదురుగా నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. ఒంటరిగా వెళ్తున్న యువతి పట్ల ఐదుగురు నేపాలీ యువకులు అత్యంత అసభ్యంగా ప్రవర్తించి, దాడికి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి బషీర్ బాగ్ సీసీఎస్ కార్యాలయం సమీపంలో ఓ యువతి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో అక్కడ కాపుగాచిన ఐదుగురు నేపాలీ యువకులు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకొచ్చారు. నడిరోడ్డుపైనే ఆమె చేయి పట్టి లాగుతూ, అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ ఊహించని పరిణామంతో సదరు యువతి తీవ్ర భయాందోళనకు గురైనప్పటికీ, సమయస్ఫూర్తితో ధైర్యం చేసి గట్టిగా కేకలు వేసింది. యువతి అరుపులు విన్న వెంటనే చుట్టుపక్కల ఉన్న స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహంతో అప్రమత్తమయ్యారు. ప్రమాదాన్ని పసిగట్టి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించిన ఆ ఐదుగురు దుండగులను స్థానికులు వెంబడించి, నలువైపులా చుట్టుముట్టి పట్టుకున్నారు. నడిరోడ్డుపైనే ఆ ఐదుగురు కామాంధులకు స్థానికులు గట్టిగా దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని బంధించి అబిడ్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. అబిడ్స్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వీరంతా నగరంలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో కార్మికులుగా పనిచేస్తున్న నేపాల్ దేశస్థులుగా తేలింది. నిందితులను సునీల్, ఉమేష్, లక్ష్మణ్, పురుషోత్తం, రామ్‌లుగా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై నిర్భయ సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు అబిడ్స్ పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తును వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. నగర నడిబొడ్డున, అది కూడా పోలీస్ కమీషనరేట్ అనుబంధ కార్యాలయం ముందే ఇలాంటి అఘాయిత్యం జరగడంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.




# వరల్డ్ కప్‌లో ఈషా సింగ్ ప్రపంచ రికార్డు..

## అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

### ఈషా ప్రదర్శన భారత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం

**హైదరాబాద్, మే 28:** జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ (ఞూాఖీ) వరల్డ్ కప్ షూటింగ్ టోర్నమెంట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డుతో సంచలన విజయం సాధించిన హైదరాబాద్ స్టార్ షూటర్ ఈషా సింగ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం రాత్రి జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్స్‌లో ఈషా అత్యంత అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా 43 హిట్స్ సాధించి, స్వర్ణ పతకంతో పాటు సరికొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఈ చారిత్రాత్మక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా చరిత్రలో ఈషా సాధించిన ఈ ఘనత ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. మన హైదరాబాద్‌కు చెందిన ఈషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో దేశంలోని కోట్లాది మంది యువతకు ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఆమె కనబరిచిన ఈ అసమాన ప్రతిభ భారతీయ క్రీడాకారులందరికీ కొండంత స్ఫూర్తిని ఇస్తుందని, అలాగే భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈషా సింగ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంతర్జాతీయ వేదికలపై మరెన్నో విజయాలు సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఫ్యూచర్ సిటీలో భూములకు రికార్డు ధరలు

## రావిర్యాలలో రూ.83,500 పలికిన చదరపు గజం భూమి

### విక్రయాల ద్వారా రూ 140 కోట్లు ఆదాయం

### హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్

**హైదరాబాద్ , మే 28 :** తెలంగాణ రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎటువంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్ లతో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డ్ స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్ లో ఎయిర్ పోర్టుకు సమీపంలోని రావిర్యా ల లో భూములను కొనుగోలు చేయడానికి అనేక మంది పోటీపడ్డారు. ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం నాడు ఇ-ఆక్షన్ ద్వారా వేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలం పాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ. 83,500 కు అమ్ముడు పోయిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం పాట ద్వారా సుమారు రూ. 140 కోట్లఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ భూములను ఇ-ఆక్షన్ లో వేలం పాట ద్వారా విక్రయిస్తున్నట్లు గత నెలలో హోసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి. ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ.26 వేల కనీసధరను నిర్ధారించగా, దీనిని దక్కించుకోడానికి పోటీ పడుతూ చదరపు గజం రూ.83,500 కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ.62,500 ధరకు అమ్ముడు పోయింది. అంతే కాకుండా సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ. 140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

### నేడు కూడా భూముల విక్రయాలు

కెపిహెచ్ బి కాలనీ, కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని మరో నాలుగు ప్లాట్లకు (భూములకు) శుక్రవారం నాడు ఇ-ఆక్షన్ నిర్వహిస్తున్నారు. కెపిహెచ్ బి కాలనీ ఫేజ్ 1-2 లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల్లోని ప్లాట్ నెం 2, కుత్బుల్లాపూర్ చింతల్ లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.





# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు!

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీా వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



**బెంగళూరు, మే 28:** కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం


## భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా

## 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

**మాస్కో, మే 28:** రష్యా–ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

## కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ సమీక్ష



**న్యూఢిల్లీ, మే 28:** అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్–బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్– అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

## అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

**టెహ్రాన్, మే 28:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా– ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

# రైతుగా మారిన టెకీ.. పిడుగుపాటుకు హఠాన్మరణం



**బెంగళూరు,మే 28:** సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

# ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో నీట్ టెస్ట్

## పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

**న్యూఢిల్లీ, మే 28:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ పక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ (ఔఇఇ÷ు–జఉ స।బి।బబి)లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి పక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.

# వర్చువల్‌గా మహానాడు ట్రెండ్ సెట్టర్!

- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కితాబు
- సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కామన్ మ్యాన్ అంటూ వ్యాఖ్య
- మహానాడులో 16 లక్షల 75 వేల మంది హాజరు
- తెరచాటు పాలనకు స్వస్తి.. ప్రజలపాలను శ్రీకారం



**అమరావతి, మే28 :** వర్చువల్‌గా మహానాడు అదరగొట్టిందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెలిపారు. వర్చువల్‌గా మహానాడు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రెండ్రోజులపాటు వర్చువల్ మహానాడు అద్భుతంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. గురువారం మహానాడు ముగింపు సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు... కామన్ మ్యాన్ అని స్పష్టం చేశారు. ఈ 23 నెలల్లో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. ప్రతి సంవత్సరం టార్గెట్ పెట్టుకుని పనిచేస్తున్నామని వివరించారు. ఒకప్పుడు పరదాల పాలన... ఇప్పుడు ప్రజల పాలన అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా చూస్తున్నామని చెప్పారు. పోకిరీలు, ఆకతాయిల ఆటకట్టిస్తామని ప్రకటించారు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల పార్టీ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. నాయకులు వస్తారు.. కొందరు కుప్పిగంతులు వేస్తారు.. పార్టీని మోసేది మాత్రం కార్యకర్తలే అని ఆయన స్పష్టం చేశారు. కార్యకర్తే అధినేత అనేది మహానాడులో కనిపించిందన్నారు. 16 లక్షల 75 వేల మంది వర్చువల్‌గా ఈ మహానాడుకు హాజరయ్యారని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వివరించారు. 18 దేశాల నుంచి ఆన్‌లైన్‌లోకి వచ్చారని పేర్కొన్నారు. రికార్డు సృష్టించడం, తిరగరాయడం, రికార్డులు బద్దలుకొట్టడం టీడీపీకే సాధ్యమని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల బీమా కోసం రూ.150 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 2047 విజన్ తయారు చేశామని.. స్వర్ణాంధ్రగా మార్చాలని ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు సరైన సమయంలో కేంద్రం సహకరించిందని సీఎం చంద్రబాబు వివరించారు. ఆదాయాన్ని పెంచుకోకపోతే మనం నిలబడలేమన్నారు. ప్రగతి లేకపోతే స్థిరంగా నిలబడలేమని చెప్పారు. రాష్ట్రానికి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వచ్చాయంటే ఆనంద పడ్డానని తెలిపారు. 23 నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు సాధనలో ముందున్నామని వివరించారు. ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ 4 తీసుకువచ్చామన్నారు. అలాగే పెట్టుబడిదారుల్లో కూడా నమ్మకాన్ని తీసుకువచ్చామని పేర్కొన్నారు. సైనింగ్, ఎంఓయూ, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్ని వేగవతం చేస్తున్నామని తెలిపారు. 36 రోజుల్లో ఫైటర్ జెట్ పరిశ్రమను తీసుకువచ్చామంటే.. అదే మన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని సోదాహరణగా వివరించారు. ఉద్యోగం ఇవ్వడమే మా భాధ్యత అని యువతకు స్పష్టం చేస్తున్నామన్నారు. ఇప్పుడు కూడా ప్రాజెక్టులలో 65 శాతం నీరు ఉంది... అయినా ఈసారి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. 15 శాతం వర్షపాతం తక్కవ పడుతుందని.. దానికి అన్ని విధాలా సన్నద్ధం కావాల్సి ఉందని తెలిపారు. స్వయం ఏపీ బ్రాండ్ తీసుకువచ్చాము... ఇది బాగా జరిగితే ఏపి బ్రాండ్.. గ్లోబల్ బ్రాండ్ అవుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఈ మహానాడుని ఆడబిడ్డలకు అంకితం చేశామన్నారు. ఇది మహిళా మహానాడు అని తెలిపారు. మహిళలకు ఆస్తిహక్కు ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు రాజకీయ స్వేచ్ఛ ఇచ్చేది కూడా టీడీపీనే తెలిపారు. కేంద్రం వద్ద అన్ని పార్టీలు ఒప్పుకోకపోతే.. మన పార్టీలోనే రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు 33 శాతం చట్ట సభల్లో సీట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మీరు ముందుంటే మిమ్మల్ని నడిపించడానికి నేను ముందుంటా మీరు సిద్ధంగా ఉండాలని మహిళలకు సీఎం చంద్రబాబు నాయడు స్పష్టం చేశారు. ఒకప్పుడు కట్నం అనేది పెద్ద భారం ఇప్పుడు ఆడపిల్లలకు రివర్స్ డౌరీ ఇచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. కేంద్రంలో మహిళా బిల్లుకు పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. మనకు పార్టీలో 18 విభాగాలు ఉన్నాయని వివరించారు. కానీ గొడ్డలి పార్టీకి ఉన్న విభాగాలు ఎన్నో తెలుసా అంటూ ఈ సభా వేదికగా ప్రశ్నించారు. గంజాయి , బ్లేడ్ బ్యాచ్, పేటిఎం బ్యాచ్, హత్యారాజకీయాలు, హిందూ ధర్మంపై దాడికి ఇంకో విభాగం, కల్తీ లిక్కర్ మాఫియా ఇంకో విభాగం ఇలాంటి ఏడు విభాగాలు పెట్టుకున్న పార్టీ ఈ గొడ్డలి పార్టీ అని వివరించారు. మీరు గొడ్డలి పార్టీతో జాగ్రత్తగా ఉండకపోతే మీకు కూడా గొడ్డలి వేటే అని ప్రజలకు సీఎం చంద్రబాబు హెచ్చరించారు. దేవాలయాలను అప్రదిష్ట పాలు చేయాలని చూసేవారిని వదిలేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.





## పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

**పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలకు శ్రీకారం**

**11లక్షల మంది మహానాడు కోసం రిజిస్టర్ చేశారు**

**మహానాడులో ఇష్టాగోష్టిగా మాట్లాడిన లోకేశ్**

**అమరావతి, మే 28 :** 11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరై.. మహానాడు మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవీకాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంతపరంగా తాము సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సిఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని నారా లోకేశ్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని నారా లోకేశ్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్ విసిరానని లోకేశ్ గుర్తు చేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు. జగన్.. ఆయన కుటుంబ చరిత్రను తవ్వి తీయించారన్నారు. రాజారెడ్డి చేసిన అరాచకాలు, బెరైటీస్ గనుల కోసం వాళ్లు ఎంతమందిని హత్య చేశారనేది జనానికి తెలియచేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. తాను వైఎస్ జగన్ కాదని.. ఆయన లాగా తన వద్ద గొడ్డలి లేదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంను ఉద్దేశించి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## 33% మహిళా రిజర్వేషన్లపై మహిళా లోకానికి గర్వకారణం

**ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**



**నందిగామ, మే 28:** మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రానున్న ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడంపై నందిగామ శాసనసభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. "ఒక మహిళా ప్రజాప్రతినిధిగా లోకేశ్ గారి ప్రకటన నా హృదయాన్ని ఆనందంతో, గర్వంతో నింపింది. ఇది ఎన్నికల నినాదం కాదు... మహిళలను పాలనా పీఠాలపై కూర్చోబెట్టి, నిజమైన పాలకులను చేసే చారిత్రాత్మక సంకల్పం" అని కొనియాడారు. యుగపురుషుడు ఎన్టీఆర్ గారు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి నాడే వారికి సమాజంలో ఆత్మగౌరవాన్ని అందించారు. పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు డ్వాక్రా విప్లవం ద్వారా ప్రతి మహిళను ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించి, ఒక శక్తిగా నిలబెట్టారు. నేడు అదే స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్తూ యువనేత శ్రీ నారా లోకేశ్ గారు చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు ప్రకటించడం ద్వారా... వారిని కేవలం ఓటర్లుగానే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే కీలక నిర్ణయాత్మక శక్తులుగా మారుస్తున్నారని శ్రీమతి సౌమ్య పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది మహిళలు చట్టసభల్లోకి అడుగుపెట్టి, ప్రజాసేవలో క్రియాశీలక పాత్ర పోషించేలా మార్గం సుగమం చేసిన శ్రీ నారా లోకేశ్ గారికి నందిగామ నియోజకవర్గ మహిళల తరపున, వ్యక్తిగతంగా తన తరపున శ్రీమతి తంగిరాల సౌమ్య గారు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

**నివాళి అర్పించిన టీడీపీ నేతలు, కుటుంబ సభ్యులు**

**హైదరాబాద్, మే 28 :** దివంగత మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, సినీ దిగ్గజం నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద గురువారం ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సినీ ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. కటుఉంబ సభ్యులు పలుఉవరు వచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ గార్డెన్‌కు చేరుకుని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వినమ్రంగా నమస్కరించారు. జూనియర్ ఎన్టీఆర్ రాకతో అక్కడ ఒక్కసారిగా అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారుజామునే భారీ సంఖ్యలో అభిమానులు ఎన్టీఆర్ గార్డెన్ వద్దకు చేరుకొని తమ అభిమాన నటుడిని చూసేందుకు పోటీ పడ్డారు. 'జై ఎన్టీఆర్ అంటూ అభిమానుల నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు అభివాదం చేస్తూ కాసేపు అక్కడ గడిపారు. ఆయన రాకతో ఎన్టీఆర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. జూనియర్ ఎన్టీఆర్ రావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అభిమానుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని టీడీపీ నేతలు కొనియాడారు. సినీరంగంలో ఎన్నో చారిత్రక పాత్రలు పోషించి కోట్లాది అభిమానులను సంపాదించు కున్నారని కీర్తించారు. రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన నాయకుడిగా ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని వ్యాఖ్యానించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని టీడీపీ నేతలు తెలిపారు. ఏడాది 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌తో పాటు ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. పేదలకు అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశామని టీడీపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా అభిమానులు ఎన్టీఆర్ సేవలను, జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. నివాళి అర్పించన వారిలో నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఒకప్పటి టిడిపి నేతలు నాగం జనార్ధన్ రెడ్డి,మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి, మండవ వెంకటేశ్వర రావు తదితరులు నివాళి అర్పించారు.



## తెలుగుజాతి ఖ్యాతిని చాటిన మహనీయుడు

**ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి**

**న్యూఢిల్లీ, మే 28:** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## ఆయన స్ఫూర్తితోనే..

**చరిత్రలో చెరిగిపోని సంతకం**

**పవన్ కల్యాణ్, చిరంజీవి భావోద్వేగ పోస్టులు**

**అమరావతి/హైదరాబాద్, మే 28:** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సందేశంలో.. "కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని రాజకీయ జీవితంలోకి వచ్చి ప్రజాపక్షం వహించిన దివంగత నేత ఎన్టీరామారావు గారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేనివి. రూ.2లకే కిలో బియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోంది" అని పేర్కొన్నారు. ఇక మెగాస్టార్ చిరంజీవి తన ఎక్స్ పోస్టులో ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. "ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా.. ప్రజా జీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయులు" అని పేర్కొన్నారు. ఇటీవల తనకు లభించిన ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ఎంతో ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని, అది ఎన్టీఆర్‌పై తనకు ఉన్న గౌరవానికి గుర్తింపుగా నిలిచిందని చిరంజీవి వెల్లడించారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

## రేపు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ERC) ముందుకు బీఆర్ఎస్ పార్టీ

- ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై వాదనలను వినిపించనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్
- శ్రీ కె.టి. రామారావు (కేటీఆర్) గారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందం

**హైదరాబాద్ మే28(;సమయం న్యూస్). :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు డిస్కం' పేరుతో చేపట్టిన చర్యలను మరియు ఆ నిర్ణయం వెనుక ఉన్న కుట్రలను ప్రజల ముందు ఉంచేందుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సిద్ధమైంది. రేపు ఉదయం 10 గంటలకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (జు=జ) ముందు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో, తెలంగాణ రైతాంగం మరియు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తన గళాన్ని వినిపించనుంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కె.టి. రామారావు (కేటీఆర్) గారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందం హాజరుకానుంది. ఈ బృందంలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గుంటకండ్ల జగదీష్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిలతో పాటు ఇతర సీనియర్ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. 'రైతు డిస్కం' ప్రతిపాదనల వల్ల రైతాంగానికి, రాష్ట్ర విద్యుత్ రంగానికి వాటిల్లే నష్టాలను మరియు ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచిన ప్రభుత్వం

**మహబూబ్‌నగర్, మే 28 (సమయం న్యూస్):** అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతుకు ప్రభుత్వం అండగా నిలిచిందని అధికారులు తెలిపారు. భూత్పూర్ మండలం హస్నాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు సందర్శించి రైతు కె. శ్రీనివాసులుకు చెందిన 156 తడిసిన ధాన్యం బస్తాలను కొనుగోలు చేసి పారా బాయిల్డ్ రైస్ మిల్లుకు తరలించారు. శేరిపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు నిల్వ చేసిన వరి భారీ వర్షాలకు తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ పరిస్థితిని పరిశీలించి తడిసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి తూకం వేసి ట్రాక్టర్ల ద్వారా నరహరి పారా బాయిల్డ్ రైస్ మిల్లుకు తరలించారు. రైతుకు కనీస మద్దతు ధర చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు అధికారులు సూచించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడంతో తనకు ఎంతో భరోసా కలిగిందని రైతు శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా యంత్రాంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు.



## సీనియర్ జర్నలిస్ట్ శ్రీరామ్ రమేష్ మృతి పట్ల గాడిపెల్లి మధు సి. హెచ్చ్. సుధాకర్ సీరియస్ జర్నలిస్ట్ దయాసాగర్ సీనియర్ జర్నలిస్ట్ లు శ్రీరామ్ రమేష్ మృతి పట్ల సంతాపం!

**వర్ధన్నపేట, మే 28:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పని చేస్తున్నా సీనియర్ జర్నలిస్ట్ శ్రీరామ్ రమేష్ హఠాన్మరణం చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని గాడిపెల్లి మధు సి. హెచ్చ్. సుధాకర్ సీరియస్ జర్నలిస్ట్ దయాసాగర్ సీనియర్ లు వ్యక్తం చేశారు. రమేష్ భౌతిక కాయానికి లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీరామ్ రమేష్ మరణం స్థానిక జర్నలిజానికి తీరని లోటని నిరంతరం ప్రజా సమస్యలపై కలం పట్టి, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడిన ఒక మంచి సహచరుడిని కోల్పోవడం అత్యంత బాధాకరం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వారి లు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని వారు సంతాపం!

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఆంధ్రజ్యోతి జాతీయ దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ శ్రీరామ్ రమేష్ హఠాన్మరణం చెందడం పట్ల గాడిపెల్లి మధు సి. హెచ్చ్. సుధాకర్ సీరియస్ జర్నలిస్ట్ దయాసాగర్ సీనియర్ లు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రమేష్ భౌతిక కాయానికిగాడిపెల్లి మధు సి. హెచ్చ్. సుధాకర్ సీరియస్ జర్నలిస్ట్ దయాసాగర్ సీనియర్

పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీరామ్ రమేష్ మరణం స్థానిక జర్నలిజానికి తీరని లోటని నిరంతరం ప్రజా సమస్యలపై కలం పట్టి, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడిన ఒక మంచి సహచరుడిని కోల్పోవడం అత్యంత బాధాకరం అని ఈ సందర్భంగా గాడిపెల్లి మధు సి. హెచ్చ్. సుధాకర్ సీరియస్ జర్నలిస్ట్ దయాసాగర్ సీనియర్ లు పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్టసమయంలో భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.



## మహిళా పెట్రోల్ బంక్ ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్ల బృందం

**నారాయణపేట, మే,28(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో డీఆర్డీఏ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా పెట్రోల్ బంక్ ను గురువారం ట్రైనీ కలెక్టర్లు శ్రీకాంత్ రెడ్డి IAS, సచిన్ IAS, సురేష్ IAS, పారస్ IAS సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సమాఖ్య సభ్యులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో ట్రైనీ కలెక్టర్ల బృందం మాట్లాడారు. పెట్రోల్ బంక్ పెట్టాలనే ఆలోచన ఎలా వచ్చింది?.. అధికారుల సహకారం? ఎంత పెట్టుబడి పెట్టారు? ప్రస్తుతం ఎంత లాభం లో నడుస్తుంది ? తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మహిళా సమాఖ్య సమావేశానికి హాజరైన అప్పటి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సలహా మేరకు తాము పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ముందుకు వచ్చామని, కోయ శ్రీహర్ష డిఆర్డిఏ కార్యాలయం పక్కనే ఉన్న 6 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చి, భారత్ పెట్రోలియం కంపెనీ తో రూ. కోటి 10 లక్షలు ఇప్పించారని, జిల్లా మహిళా సమాఖ్య నుంచి 35 లక్షలు పెట్టుబడి పెట్టి పెట్రోల్ బంక్ పనులు ప్రారంభించామని జిల్లా సమాఖ్య సభ్యులు కలెక్టర్ల బృందానికి తెలిపారు. అయితే అంతలోనే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బదిలీ కావడంతో పెట్రోల్ బంక్ ఏర్పాటు మధ్యలోనే నిలిచి పోతుందని తాము భావించామని, కానీ కోయ శ్రీహర్ష స్థానంలో జిల్లా కలెక్టర్ గా వచ్చిన సిక్తా పట్నాయక్ ను కలిసి పెట్రోల్ బంక్ గురించి తెలియజేయడంతో ఆమె సానుకూలంగా స్పందించడంతో పెట్రోల్ బంక్ పనులు పూర్తయ్యాయని, అన్ని అనుమతులతో 2025 ఫిబ్రవరి 21న రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింప చేసుకున్నట్లు మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ల బృందానికి వివరించారు. ఇప్పటిదాకా మహిళా పెట్రోల్ బంక్ ద్వారా 10 లక్షల 23 వేల లీటర్ల పెట్రోల్, 11లక్షల 62 వేల లీటర్ల డీజిల్ విక్రయించగా 61 లక్షల ఆదాయం వచ్చిందని, వేతనాలు, ఇతర ఖర్చులు పోగా, 27 లక్షల 50 వేల లాభంతో పెట్రోల్ బంక్ కొనసాగుతిండనాయ మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ల బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ వెంకట్ రాములు, డిపిఎం జయన్న తదితరులు పాల్గొన్నారు.



## బాల్యం నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన




కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు, రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక చావర అకాడమీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన "ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్"ను సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న విద్యార్థులు గత రెండు రోజులుగా సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ విద్యాధర రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతా నియమాలను అలవరుచుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాధాన్యత, జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం వంటి ప్రాథమిక అంశాలను విద్యార్థులు ప్రాక్టికల్‌గా తెలుసుకునేందుకు ఈ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఉప్పుం తిరుపతి మాట్లాడుతూ, పుస్తక పరమైన జ్ఞానంతో పాటు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందిస్తాయని అన్నారు. సమ్మర్ క్యాంప్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్శన కార్యక్రమంలో చావర అకాడమీ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, రవాణా శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా డ్రైవర్లకు జిల్లా కలెక్టర్ ప్రోత్సాహకాలు



**కామారెడ్డి, మే 28 (సమయం న్యూస్):** బక్రీద్ పండుగ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం రవాణా సేవలను అందిస్తున్న ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పండుగ సమయంలో కూడా ధాన్యం రవాణా సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తూ రైతులకు సహకరిస్తున్న డ్రైవర్ల సేవలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్ల సేవలను ప్రశంసిస్తూ వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణాదారులు, డ్రైవర్లు, మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్

**హైదరాబాద్, మే 28 (సమయం న్యూస్):**టీడీపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా హీరో జూనియర్ ఎన్టీఆర్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలు, ప్రజా సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## కర్ణాటకలో సీఎం మార్పుపై జోరుగా చర్చ

**బెంగళూరు/ఢిల్లీ, మే 28 (సమయం న్యూస్):**కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పుపై ఆసక్తికర చర్చ సాగుతోంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఢిల్లీకి పిలిపించి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. రాజ్యసభ స్థానాలు, పాలనాపరమైన అంశాలపైనే చర్చ జరిగిందని పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ, సీఎం మార్పుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ ఇద్దరు నేతలతో విడివిడిగా సమావేశం కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య రెండున్నరేళ్ల చొప్పున సీఎం పదవి పంచుకునేలా ఒప్పందం కుదిరిందని అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్యను కేంద్ర రాజకీయాల్లోకి తీసుకెళ్లి, సీఎం పదవిని డీకే శివకుమార్‌కు అప్పగించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

రేపు బెంగళూరులో ఇద్దరు నేతల మధ్య జరగనున్న బ్రేక్‌ఫాస్ట్ సమావేశం తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కొడుకు జ్ఞాపకాలతో పుష్కర స్నానం చేసిన తల్లి



**కాళేశ్వరం, మే 28 (సమయం న్యూస్):**కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం సరస్వతి ఘాట్ వద్ద ఓ తల్లి తన మరణించిన కుమారుడి ఫోటో చేతబట్టి పుష్కర స్నానం చేయడం పలువురిని కదిలించింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బేతాళగడ్డ గ్రామానికి చెందిన గంగిశెట్టి పద్మావతి తన కుమార్తె ఝాన్సీతో కలిసి కాళేశ్వరానికి చేరుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తన కుమారుడు గంగిశెట్టి మహేష్ జ్ఞాపకార్థం, ఆయన ఫోటోను చేతబట్టి పుష్కర స్నానం ఆచరించారు.

ఈ దృశ్యం ఘాట్ వద్ద ఉన్న భక్తులను భావోద్వేగానికి గురిచేసింది. కుమారుడిపై తల్లికి ఉన్న మమకారానికి ఇది నిలువెత్తు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

## పుష్కర భక్తులకు ఉచిత అన్నదానం



**కాళేశ్వరం, మే 28( సమయం న్యూస్) :** సరస్వతి అంత్య పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తుల కోసం దేవాలయం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు ఆహార సమస్యలు ఎదుర్కొనకుండా ప్రత్యేక అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో ఈ కార్యక్రమం పకడ్బందీగా కొనసాగుతోంది. అన్నదానంలో పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని దేవస్థానం ఈఓ మహేష్ తెలిపారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించడంతో కాళేశ్వరం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది.



నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవ రెడ్డి గురువారం పుష్కర స్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయ చైర్మన్ మోహన శర్మ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

**సిరోలు మే28( సమయం న్యూస్). :** సిరోల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్‌పై అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై సిరోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకుడని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అత్యధికంగా అందజేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. "బొకేలు వద్దు -- పుస్తకాలు ముద్దు" అనే సందేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ఎన్.టి.రామారావు గారికి నివాళి

- **ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

విజయవాడ మే28( సమయం న్యూస్)

కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని రాజకీయ జీవితంలోకి వచ్చి-ప్రజా పక్షం వహించిన నేత దివంగత ఎన్.టి.రామారావు గారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేనివి. ఎన్.టి.రామారావు గారు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. రూ.2కే కిలో బియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోంది.

## ఇషా సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు




**హైదరాబాద్, మే 28 (సమయం న్యూస్):** ఈ షా సింగ్‌ూాఖీ ప్రపంచ కప్-2026 షూటింగ్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన ఇషా సింగ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ూా. =వఝుఅ్ష్ర =వుఎంఎ అభినందనలు తెలిపారు. మ్యూనిచ్‌లో జరుగుతున్న ISSF వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన ఇషా సింగ్ విజయం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని కొనియాడారు. ఆమె ప్రదర్శన భారత క్రీడాకారులకు ప్రేరణగా నిలవడంతో పాటు భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో ఇషా సింగ్ మరెన్నో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు.

## నేడుటీజీఈఆర్‌సీ బహిరంగ విచారణ

**హైదరాబాద్ మే28( సమయం న్యూస్) :** తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఆర్‌పీడీసీఎల్) ఏర్పాటు అంశంపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) శుక్రవారం బహిరంగ విచారణ నిర్వహించనుంది. కొత్త రైతు డిస్కమ్ అవసరం, ప్రస్తుత డిస్కమ్‌ల వైఫల్యాలు, రైతు డిస్కమ్ ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై ఈ విచారణలో చర్చ జరగనుంది. ఈ బహిరంగ విచారణలో పాల్గొని తమ అభిప్రాయాలు, వాదనలు వినిపించేందుకు దాదాపు 60 మందికిపైగా టీజీఈఆర్‌సీ వద్ద నమోదు చేసుకున్నారు. వీరిలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, రైతు సంఘాల ప్రతినిధులు, విద్యుత్ రంగ నిపుణులు, ఉమ్మడి రాష్ట్ర విద్యుత్ సంస్థల మాజీ డైరెక్టర్లు, జర్నలిస్టులు, విద్యుత్ సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్‌తో పాటు మూడు విద్యుత్ సంస్థల సీఎండీలు విచారణకు హాజరుకానున్నారు. విచారణకు హాజరుకానున్న వారిలో దొంతి నర్సింహారెడ్డి, ఎస్. సూర్యప్రకాశ్ రావు, ఆర్వీ సుబ్బారావు, ఎం. తిమ్మారెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే టి. హరీష్‌రావు, సుభాష్ చంద్రబోస్, రిటైర్డ్ సీఈ (గోల్డ్ మెడలిస్ట్) తదితరులు ఉన్నారు.

# ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా" సభ విజయవంతం చేయాలి

### జేఏసీ నాయకుడు గూని నందు

**రాయపోల్, మే 28 :** బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 5 శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న "ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా" బహిరంగ సభను విజయవంతం చేయాలని జేఏసీ నాయకుడు గూని నందు పిలుపునిచ్చారు. ఈ మేరకు తిమ్మక్కపల్లి, ముబారస్పూర్, సూరంపల్లి గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. కులాల జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. సభకు రాష్ట్ర చైర్మన్ విశారదన్ మహారాజ్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, బాలకృష్ణ, కరుణాకర్, స్వామి, కార్తీక్, భాను, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రవణ్, ప్రశాంత్ లు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో బక్రీద్.



**రాయపోల్, మే 28 :** రాయపోల్ మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆ లింగనం చేసుకుంటూ. బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ముస్లిం మత పెద్దలు ప్రవక్త బోధనలు వివరించారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు

- **మండల వ్యవసాయ శాఖ అధికారి నరేష్.**



**రాయపోల్, మే 28 :** నేటి నుంచి మండల పరిధిలో పచ్చి రొట్ట ఎరువుల కోసం వినియోగించే జనుము, జీలు గు విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నరేష్ తెలిపారు. భూసారాన్ని పెంపొందించడంతో పాటు పంట దిగుబడులకు ఉపయోగపడే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, తమకు సంబంధించిన రైతు వేదికల్లో పర్మిట్ తీసుకోవాలని తెలిపారు. అనంతరం రాయపోల్ ఆగ్రో రైతు సేవా కేంద్రాల వద్ద విత్తనాలను పొందవచ్చన్నారు. సబ్సిడీ అనంతరం రైతులు చెల్లించాల్సిన ధరలు జనుము 40 కిలోల బ్యాగ్‌కు రూ.3,110 కాగా, జీలుగు 30 కిలోల బ్యాగ్‌కు రూ.2,452.50గా నిర్ణయించినట్లు నరేష్ వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## రియల్ వర్సిటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 30న "రియల్టర్స్ గ్రోత్ కాంక్లేవ్ -- 2026"




**హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ రంగంలో రియల్టర్ల అభివృద్ధి, అవగాహన, వ్యాపార వృద్ధి మరియు నెట్‌వర్కింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో రియల్ వర్సిటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 30న నిర్వహించనున్న "రియల్టర్స్ గ్రోత్ కాంక్లేవ్ -- 2026" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను శ్రీ సిద్ధివినాయక ప్రాపర్టీ డెవలపర్స్ సీఎండీ కాసర్ల మహేందర్ రెడ్డి, డైరెక్టర్ రఘుమ రెడ్డి, రియల్ వర్సిటీ ఫౌండర్ ఈ ఉరుకుంద శెట్టి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న రియల్టర్లకు విద్య, వ్యాపారాభివృద్ధి, నాయకత్వ నైపుణ్యాల పెంపొందనకు ఈ కాంక్లేవ్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు. కాగా, జూన్ 30న జరగనున్న ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ రంగ ప్రముఖులు, నిపుణులు, రియల్టర్లు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సాయి విజేందర్, వెంకట్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ లో ఘనంగా బక్రీద్ (ఈద్ -ఉల్-అజ్హా) జరుపుకున్న ముస్లిం సోదరులు



**కొడంగల్ మున్సిపల్,(మం)మే,28(సమయం న్యూస్) :** బక్రీద్ పండుగ (ఈద్ -ఉల్-అజ్హా) సందర్భంగా కొడంగల్ పట్టణ కేంద్రంలోని ముస్లిం సోదరులు పెద్దలు, చిన్నలు మత పెద్దతో కలిసి ఈద్గా లో ప్రత్యేక బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా)పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఒకరిని ఒకరు కలుసుకొని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మరియు వివిధ గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తరలింపు వేగవంతం

- **అదనపు లారీలు, ట్రాక్టర్లతో తడిసిన ధాన్యాన్ని పారా బాయిల్డ్ మిల్లులకు తరలింపు**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్, మే,28(సమయం న్యూస్) :** యాసంగి 2025-26 సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా మరియు మిల్లులకు తరలింపు ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం రాత్రి, నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల పరిధిలో సుమారు 3000 వేల బ్యాగులు, 120 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ధాన్యం తరలింపుపై ప్రత్యేక చర్యలు

తడిసిన ధాన్యం రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి అత్యవసరంగా పారా బైయిల్డ్ మిల్లులకు తరలింపు చర్యలు చేపట్టామన్నారు. నిన్న ఒక్క రోజే సుమారు 120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీపంలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు విజయవంతంగా తరలించారు. ఎక్కడైతే వర్షపు నీటితో తడిసిన ధాన్యాన్ని సంచుల్లో నింపి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పి పి సి సెంటర్ పరిగి మండలం సుల్తాన్ పూర్, గ్రామం, పి పి సి సెంటర్ బాలంపేట్ గ్రామం, దౌల్తాబాద్ మండలం, పి పి సి సెంటర్ మేకవనం పల్లి, గ్రామం, మోమిన్ పేట్ మండలం, పిపిసి సెంటర్ ముజాయిద్ పూర్ గ్రామం కుల్క చెర్ల, మండలంలో నిల్వ చేసిన వరి ధాన్యం వర్షాల కారణంగా పూర్తిగా తడిసిపోవడంతో అధికారులు వెంటనే స్పందించి పరిశీలించి పారా బాయిల్డ్ మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ధాన్యాన్ని సురక్షితంగా తరలించి ఎంఎస్పీ చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లులకు తరలింపు మరియు ఎంఎస్పీ చెల్లింపుల ప్రక్రియలను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు.




# త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్

## : మంత్రి కొండా సురేఖ



**వరంగల్, మే 28( సమయం న్యూస్). :** మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావు గార్లను శాలువాలతో సత్కరించి ఘనంగా గౌరవించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కు విధేయతకు ప్రతీక అని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులుగా భావించి ఈద్గా ప్రార్థనలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, కమిటీ సభ్యులకు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్ల ద్వారా ఎంతోమంది ముస్లింల జీవితాల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించిన మంత్రి సురేఖ, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు









**కాళేశ్వరం, మే 28:,( సమయం న్యూస్). :** కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా దేవాదాయ శాఖ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పరంపర ఫౌండేషన్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ ఆధ్యాత్మికత, సంగీతం, లయ, భావవ్యక్తీకరణల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమాలు విశేష ఆదరణ పొందాయి. మంగళాచరణ్‌తో ప్రారంభమైన కార్యక్రమంలో మాతంగి దేవి స్తుతి, త్రిఖండి ప్రణామం భక్తి భావాన్ని పంచాయి. అనంతరం "బట్టు" నృత్య ప్రదర్శనలో ఒడిశా దేవాలయ శిల్ప సంపదను ప్రతిబింబించే శిల్ప భంగిమలను కళాకారులు అద్భుతంగా ఆవిష్కరించారు. "పల్లవి" ప్రదర్శనలో సంగీతం, లయ, నృత్య కదలికల సమన్వయం ప్రేక్షకులను ఆకట్టుకోగా, "శివ పంచాక్షరి"లో పరమశివుని తాండవ రూపాన్ని హావభావాలతో శక్తివంతంగా చిత్రీకరించారు. చివరిగా "మోక్ష" పేరుతో మహాకాళి స్తుతి ప్రదర్శన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. భక్తి, శక్తి, తత్వబోధల సమ్మేళనంగా సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు భారతీయ శాస్త్రీయ కళల వైభవాన్ని ప్రతిబింబిస్తూ కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక-సాంస్కృతిక కేంద్రంగా నిలుపుతున్నాయి.

# ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..!

- చేతికందే ఎత్తులో 11 కేవీ విద్యుత్ వైర్లు.



**రాయపోల్, మే 28:** రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామ శివారులో గల్వోని చెరువు కట్ట వెనుక ఉన్న కొత్తింట్ల నర్సింలు వ్యవసాయ పొలంలో 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా చేతికందే ఎత్తులో వేలాడుతూ రైతులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పొలంలో వ్యవసాయ పనులు నిర్వహించే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళన నెలకొంది. విద్యుత్ వైర్లు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతు కొత్తింట్ల నర్సింలు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రమాదం జరిగాక స్పందించకుండా, ముందస్తుగా అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ వైర్లను సరిచేసి రైతుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు





**కోటగిరి, మే 28: (సమయం న్యూస్) :** మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా కోటగిరి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కోటగిరి మండలంలోని మీర్జాపూర్ క్యాంప్‌లో రూ. 1 కోటి ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్‌ను పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ ఫంక్షన్ హాల్‌ను స్థల దాతలు స్వర్గీయ మిక్కిలినేని నారాయణమ్మ, స్వర్గీయ మిక్కిలినేని వెంకటరత్నం జ్ఞాపకార్థం నిర్మించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి, పోతంగల్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డ్

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్:మే28,( సమయం న్యూస్) :** రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత లబ్ధి అందుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక, విద్యా శాఖ పథకాలు, బీమా పథకాల వివరాలను ఈ కార్డులో పొందుపరచాలని సీఎం సూచించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇవ్వాలనే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెంచేందుకు, నిజమైన అర్హులకు లబ్ధి చేరేందుకు ఏఐ ఆధారిత విశ్లేషణ ఉపయోగ పడుతుందని సీఎం పేర్కొన్నారు. అనర్హులను గుర్తించడం కూడా సులభమవుతుందని అన్నారు. మరణ ధృవీకరణ పత్రం జారీ అయిన వెంటనే ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో అనుసంధానించాలని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# జిల్లాలో 17,148 మంది రైతుల నుండి 1,31,986 మెట్రిక్ టన్నుల వరి ధాన్యమును కొనుగోలు చేయడం జరిగింది.

- జిల్లా కలెక్టర్, సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, మే,28(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో గురువారం వరకు 17,148 మంది రైతుల నుండి 1,31,986 మెట్రిక్ టన్నుల వరి ధాన్యమును కొనుగోలు చేయడం జరిగినదనీ జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక తెలిపారు. దీని విలువ రూ. 315.31 కోట్ల రూపాయలు దీనిలో 15986 వరకు మంది రైతులకు రూ. 262 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగినదనీ, ( 83% ) అలాగే మిగతా అమౌంట్ కూడా 48 గంటల్లో రైతుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందనీ తెలిపారు. అదేవిధంగా మన జిల్లాలో అకాల వర్షాలకు ఎక్కడైనా ధాన్యం తడిసిన అధికారుల సమన్వయంతో వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుంది. అలాగే ధాన్యం కొనుగోలు కూడా మన జిల్లాలో 98% పూర్తిగా అవడం జరిగింది మిగిలిన ధాన్యాన్ని కూడా రెండు రోజుల్లో కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తామని తెలపడం అయినది...

# సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్







**హన్మకొండ మే28( సమయం న్యూస్) :** అప్పగించిన పనులను అధికారులు సమ-ర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ స్పష్టం చేశారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు దేవేందర్, హరికృష్ణ సీపీని మర్యాదపూ ర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ కీర్తిప్రతిష్టలు అధికారుల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# గ్రామీణ ఉపాధి హామీ నిధుల కేటాయింపులో కీలక మార్పులు

**వరంగల్ , మే 28( సమయం న్యూస్). :** గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కొత్త చట్టం 'వీబీజీ రామ్‌జీ' ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ చట్టం జూలై 1 నుంచి అమల్లోకి రానున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా నిబంధనలపై ప్రజలు, నిపుణుల నుంచి జూన్ 21 వరకు అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం కేంద్ర నిధుల కేటాయింపులో మార్పులు చోటుచేసుకోనున్నాయి. పెద్ద రాష్ట్రాలు, ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ముసాయిదాలో పేర్కొన్నారు. జనాభా, తలసరి ఆదాయాన్ని ఆధారంగా తీసుకుని నిధుల పంపిణీ జరగనుంది. తలసరి ఆదాయం తక్కువగా ఉన్న రాష్ట్రాలకు 42.5 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపాదించారు. అలాగే వేతన భారం విషయంలో ఇప్పటివరకు మొత్తం కేంద్రం భరించగా, కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ఖరీఫ్ సన్నద్ధతపై కేంద్రం ప్రత్యేక దృష్టి

**న్యూఢిల్లీ, మే 28:( సమయం న్యూస్) :** ఖరీఫ్ సీజన్ సన్నద్ధతను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. న్యూఢిల్లీలోని పూసా క్యాంపస్‌లో జరిగిన ఖరీఫ్ కాన్ఫరెన్స్--2026పై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియాతో మాట్లాడారు.దేశ ఆహార భద్రత, రైతుల ఆదాయం పెంపు, ప్రజలకు పోషకాహారం అందించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. మే 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, శాస్త్రవేత్తలు, ఐసీఏఆర్ ప్రతినిధులు, కేంద్ర--రాష్ట్ర అధికారులు పాల్గొంటున్నారు.ప్రతి రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులు వేర్వేరుగా ఉన్నందున ప్రాంతాల వారీగా వ్యూహాలు అవసరమని మంత్రి తెలిపారు. ఖరీఫ్, రబీ పంటల సన్నద్ధత, నాణ్యమైన విత్తనాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల్లో స్వయం సమృద్ధి, ప్రకృతి వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం, రైతు గుర్తింపు, ఎఫ్‌పీవోల బలోపేతం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.2025-26లో దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి 376.563 మిలియన్ టన్నులకు చేరిందని మంత్రి వెల్లడించారు. బియ్యం ఉత్పత్తి 154.024 మిలియన్ టన్నులకు చేరి చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. గోధుమలు, మొక్కజొన్న, నూనెగింజల ఉత్పత్తిలోనూ రికార్డు స్థాయి పురోగతి సాధించామని చెప్పారు.వాతావరణ మార్పులు వ్యవసాయానికి పెద్ద సవాలుగా మారుతున్న నేపథ్యంలో, సురక్షితమైన, స్థిరమైన వ్యవసాయ విధానాలపై కేంద్రం--రాష్ట్రాలు కలిసి ఖరీఫ్ పంటల కోసం సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నాయని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

## పీఎంఏవై-జీ కింద 12 రాష్ట్రాలకు రూ.10,021 కోట్లు విడుదల

- భూమిలేని పేదలకు భూమి కేటాయించాలని రాష్ట్రాలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచన

**న్యూఢిల్లీ, మే 28( సమయం న్యూస్.) :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ పథకం కింద 12 రాష్ట్రాలకు రూ.10,021.42 కోట్ల మదర్ శాంక్షన్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డా. చంద్రశేఖర్ పెమ్మసాని పాల్గొన్నారు.అస్సాం, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఈ నిధులు విడుదలయ్యాయి. 2029 మార్చి నాటికి 'ప్రతి ఒక్కరికీ ఇల్లు' లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

పీఎంఏవై-జీ కింద 4.95 కోట్ల ఇళ్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 3.91 కోట్ల ఇళ్లకు అనుమతులు మంజూరయ్యాయని, 3.05 కోట్లకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఎల్‌పీజీ, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలతో పేదలకు గౌరవప్రదమైన జీవన వసతి కల్పిస్తున్నామని చెప్పారు.పథకం కింద మంజూరైన ఇళ్లలో దాదాపు 75 శాతం మహిళల పేరుపై లేదా సంయుక్త యాజమాన్యంలో ఉండటం మహిళా సాధికారతకు దోహదపడుతోందన్నారు. భూమిలేని పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నందున రాష్ట్రాలు వారికి భూమి కేటాయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగించాలని కేంద్ర మంత్రి రాష్ట్రాలను కోరారు. 2024-25, 2025-26 లక్ష్యాలకు అనుగుణంగా అనుమతుల ప్రక్రియను జూన్ 30, 2026లోపు పూర్తి చేయాలని సూచించారు.

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి పీఎంఏవై-జీ లబ్ధిదారుడు 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా కనీసం ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రపంచానికే తలమానికంగా "ఫ్యూచర్ సిటీ"

- ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- FCDA కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు





**హైదరాబాద్ మే28( సమయం న్యూస్). :** ప్రపంచానికే తలమానికంగా ఉండేలా "ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నాడు రాష్ట్ర రెవెన్యూ, హౌ సింగ్, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ప్రతిష్టాత్మక "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖీజణా) కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖీజణా) కార్యాలయ ప్రారంభోత్సవాన్ని కి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతు న్నాయని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. మంత్రులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ కె. శశాంక, ఐఏఎస్, మహేశ్వరం డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ఓట్లు అడగాలి

- మంత్రి పొంగులేటికి కేటీఆర్ సవాల్
- కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మే 28( సమయం న్యూస్) :** హైదరాబాద్ నగరంలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని మంత్రి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఆ మాట నిలబెట్టుకునే దమ్ము ఉందా అని ప్రశ్నించారు.

సవాళ్లు చేయడం, ఆపై పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటైందని విమర్శించిన కేటీఆర్.. శపథాలు చేయడం కాకుండా చేతనైతే చేసి చూపించాలని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ప్రజల ముందు ప్రతినబూనాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు.తమ పార్టీ పేదల కోసం ఆత్మగౌరవ గృహాలను నిర్మించిందని, హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. తాము నిర్మించిన ఒక్కో గృహం ఏడు ఇందిరమ్మ ఇండ్లతో సమానమని పేర్కొన్నారు. డబ్బా ఇండ్లు కాకుండా గౌరవప్రదమైన గృహాలను నిర్మించామని చెప్పారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు నిర్మించడం కంటే పేదల ఇళ్లను కూల్చడంపైనే దృష్టి పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. గత రెండున్నర సంవత్సరాల్లో హైదరాబాద్‌లో ఎన్ని ఇండ్లు నిర్మించారో, ఎన్ని ఇండ్లు కూల్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మంత్రి పొంగులేటిపై వ్యక్తిగత విమర్శలు చేసిన కేటీఆర్.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడమే తమకు తెలుసని, ఢిల్లీకి లొంగిపోయే రాజకీయాలు తమకు తెలియవని వ్యాఖ్యానించారు. రెవెన్యూ వ్యవస్థను అడ్డుపెట్టుకొని భూదందాలు, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా ప్రజా హామీల అమలుపై ప్రశ్నించడం ఆపబోమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## బెంగళూరు--ముంబై ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రైల్వే మంత్రి





**న్యూ డిల్లీ మే28( సమయం న్యూస్). :** బెంగళూరు--ముంబై మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ రైలు కర్ణాటక--మహారాష్ట్ర మధ్య రైలు అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.బెంగళూరు--ముంబై వందే భారత్ స్లీపర్ సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయని మంత్రి ప్రకటించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కర్ణాటకలో 61 స్టేషన్లను రూ.2,160 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. బెంగళూరు కాంటోన్మెంట్, యశ్వంత్‌పూర్ స్టేషన్ల అభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు.కర్ణాటకలో 2014 తర్వాత సుమారు 1,750 కి.మీ. కొత్త రైల్వే లైన్లు నిర్మించామని, సబర్బన్ రైల్వే ప్రాజెక్టు పనులు కూడా పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. బెంగళూరు--హైదరాబాద్, బెంగళూరు--చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నాం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, మే 28:( సమయం న్యూస్) :** జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా కొంత వరిధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరిధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.అకాల వర్షాల కారణంగా తడిసిన సుమారు 2,976 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ధాన్యం ఆరబెట్టడం, లిఫ్టింగ్, రవాణా ప్రక్రియలను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నదని వివరించారు.అలాగే, మే 28 నాటికి జిల్లాలో మొత్తం 58,455 మంది రైతుల నుంచి 3,14,868 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.457 కోట్ల చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, సిద్ధిపేట జిల్లా

## పార్లమెంటరీ వారసత్వ పరిరక్షణతో ప్రజాస్వామ్య చైతన్యం బలోపేతం

**న్యూఢిల్లీ, మే 28:( సమయం న్యూస్). :** భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి మార్గదర్శకమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఢిల్లీ శాసనసభ చారిత్రక మందిరంలో కేంద్ర శాసనసభ 1924--1930 కార్యకలాపాల 89 సంపుటాలు, 'విధాన్-చేతన' త్రైమాసిక పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బిర్లా మాట్లాడుతూ, వాస్తవాల ఆధారంగా జరిగే చర్చలు, అర్థవంతమైన సంభాషణలే ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడతాయని చెప్పారు. పార్లమెంటరీ వారసత్వాన్ని పరిరక్షించడం భవిష్యత్ తరాల్లో ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు కీలకమన్నారు.కేంద్ర శాసనసభ తొలి భారతీయ స్పీకర్ విఠల్‌భాయ్ పటేల్ పార్లమెంటరీ సంప్రదాయాలు, సభాధ్యక్షుడి నిష్పక్షపాత ధోరణికి బలమైన పునాది వేశారని ఆయన గుర్తుచేశారు. ఆధునిక శాసనకర్తలకు ఆయన వారసత్వం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.డిజిటలీకరణ, ఈ-లెజిస్లేచర్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతలు శాసన పరిశోధన, విధాన రూపకల్పనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుస్తున్నాయని బిర్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, ఢిల్లీ శాసనసభ స్పీకర్ విజేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ పరీక్షల అంశాలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్ష

**న్యూఢిల్లీ, మే 28:( సమయం న్యూస్) :** సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల మూల్యాంకనం, ఫలితాల అనంతర సేవలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సీబీఎస్ఈ ప్రధాన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన మంత్రి, విద్యార్థుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.ఈ ఏడాది 18 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, సుమారు 11 లక్షల స్కాన్ చేసిన జవాబు పత్రాలను విద్యార్థులు ఇప్పటికే పోర్టల్ ద్వారా వీక్షించినట్లు అధికారులు తెలిపారు.పోర్టల్‌లో లాగిన్, సర్వర్, చెల్లింపుల సమస్యల పరిష్కారానికి ఐఐటీ మద్రాస్ నిపుణులతో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రజా ప్రభుత్వం అండ

● మంత్రి సీతక్క





**ములుగు జిల్లా మంగపేట, మే 28( సమయం న్యూస్) :** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మంగపేట రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని, చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలని సూచించారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**పెద్దపల్లి, మే 28 : ( సమయం న్యూస్,) :** రాష్ట్రంలో రైతుల చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 లక్షల మంది రైతులకు రూ. 11 వేల కోట్లు చెల్లింపుఇంకా 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని వెల్లడివర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీబాయిలర్ మిల్లులకు తడిసిన ధాన్యం తరలింపు, నష్టాలు వస్తే ప్రభుత్వం భరిస్తుందన్న మంత్రి

డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు

ఇసుక రవాణా వాహనాలను 4 నుంచి 5 రోజుల పాటు ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులకు ఆదేశం

రాష్ట్రవ్యాప్తంగా 8575 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని వెల్లడి

ఎఫ్‌సీఐ 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో ముందుకు వెళ్తోందని వ్యాఖ్య

కనీస మద్దతు ధర అమలుతో రైతులకు అదనంగా రూ. 16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడింపు

ప్రస్తుతం కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే వర్షాలకు తడిసిందని స్పష్టం చేశారు ఈ సందర్భంగా

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం నిల్వ కోసం అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని తెలిపారు. రైతుల నుంచి తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో ఇప్పటివరకు రూ. 788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు..

# పర్యావరణ పరిరక్షణతో పాటు రైతు సంక్షేమమే లక్ష్యం

- భట్టి విక్రమార్క
- 81 గ్రామాల్లో మోడల్ సోలార్ గ్రామాల పథకం అమలు
- 18,542 మెగావాట్ల పీక్ డిమాండ్‌కూ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా
- తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యం మద్దతు ధరతో కొనుగోలు





**బోనకల్, మే 28:( సమయం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో వ్యవసాయ పంప్‌సెట్లకు ఏర్పాటు చేసిన 7.5 కిలోవాట్ సోలార్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో తొలి విడతగా 81 గ్రామాల్లో మోడల్ సోలార్ గ్రామాల పథకాన్ని అమలు చేస్తున్నామని, రూ. 1,380 కోట్లతో గృహాలు, వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 27 గ్రామాల్లో రూ. 445 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 18,542 మెగావాట్లకు చేరినా ఎక్కడా అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

అకాల వర్షాలతో తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి తెలంగాణలో ధాన్యం కొనుగోలు జరిగిందని, రాష్ట్రం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 2.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం రవాణా కోసం ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఐబీసీకి పదేళ్లు.. రూ.4 లక్షల కోట్లకు పైగా రికవరీ

**న్యూఢిల్లీ, మే 28( సమయం న్యూస్). :** 2016లో అమల్లోకి వచ్చిన దివాలా, దివాళా పరిష్కార కోడ్ (ఐబీసీ)కు పదేళ్లు పూర్తయ్యాయని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2026 మార్చి నాటికి 1,419 కేసుల్లో పరిష్కార ప్రణాళికలు అమలై రుణదాతలకు రూ. 4 లక్షల కోట్లకు పైగా రికవరీ సాధ్యమైందని పేర్కొంది. మొత్తం 8,987 కేసుల్లో 4,099 కంపెనీలు రక్షించబడగా, 3,003 కేసులు లిక్విడేషన్‌కు వెళ్లాయి. ఐబీసీ ప్రభావంతో బ్యాంకుల ఎన్‌పీఏలు 2017లో 11.8 శాతం నుంచి 2025 నాటికి 2.1 శాతానికి తగ్గినట్లు కేంద్రం వెల్లడించింది.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌కు భారీ ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, మే 28:,( సమయం న్యూస్) :** సర్ఫేస్ కోల్/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో రోడ్‌షో నిర్వహించింది. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి +. ఖఅంష్ఘుఅ =వ.ఎ.ఎ మాట్లాడుతూ కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా దేశం దిగుమతులపై ఆధారాన్ని తగ్గించుకుని స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 8,500 కోట్ల ప్రోత్సాహక పథకంతో పాటు అదనంగా రూ. 37,500 కోట్ల ఆర్థిక సహాయ ప్యాకేజీని కేంద్రం ఆమోదించిందన్నారు. ఈ పథకాలతో రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు. కేంద్ర సహాయ మంత్రి సతీష్ చంద్ర దుభే మాట్లాడుతూ ాచీ+, యూరియా, మెథనాల్ వంటి ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడంలో ఈ ప్రాజెక్టులు కీలకమని తెలిపారు.

# మధిరను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం: భట్టి విక్రమార్క





**ఎర్రుపాలెం, మే 28:( సమయం న్యూస్). :** మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గోసవీడు, ఇనగాలి, ములుగుమాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో బీటీ రోడ్లు, ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ములుగుమాడులో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

పెద్ద గోపవరంలో 132/33 కేవీ ఎర్రుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్, జమలాపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బోనాల సందడిలో భక్తి పరవశం.

● పోచమ్మ తల్లికి బోనాలు.



**రాయపోల్ , మే 28:** రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారి బోనాల పండుగ భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో రంగురంగుల బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించగా గ్రామమంతా భక్తిరసంలో మునిగిపోయింది. దప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో పండుగకు ప్రత్యేక శోభ చేకూరింది. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు కురవాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరూ అష్ట ఐశ్వర్యాలతో సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని భక్తులు పోచమ్మ తల్లిని వేడుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# వెల్‌డన్ వైభవ్.. యువ సంచలనాన్ని అభినందించిన కావ్య మారన్..

- ఐపీఎల్ ఎలిమినేటర్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసం
- 29 బంతుల్లో 97 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్
- మ్యాచ్ అనంతరం వైభవ్‌ను ప్రత్యేకంగా అభినందించిన కావ్య మారన్
- ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- వైభవ్ అరుదైన టాలెంట్ అంటూ కితాబిచ్చిన ఎస్‌ఆర్‌హెచ్ కోచ్

**మనసులోమాట:**

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడి అసాధారణ ఆటతీరు ప్రత్యర్థి జట్టు యాజమాన్యాన్ని సైతం ఆకట్టుకుంది. ముఖ్యంగా ఎస్‌ఆర్‌హెచ్ సహ యజమాని కావ్య మారన్ చూపిన క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

మ్యాచ్ అనంతరం కావ్య మారన్ స్వయంగా వైభవ్ వద్దకు వెళ్లి అతడిని ప్రత్యేకంగా అభినందించారు. యువ ఆటగాడితో కరచాలనం చేసి, ప్రశంసలు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రత్యర్థి జట్టు ఆటగాడిని ప్రోత్సహించిన కావ్య తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**ఇలాంటి టాలెంట్‌ను చూడలేదు: జేమ్స్ ఫ్రాంక్లిన్**

మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్ అసిస్టెంట్ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్ సైతం వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. మ్యాచ్ అనంతరం ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ.. "బహుశా ఇలాంటి టాలెంట్‌ను ఎవరూ చూసి ఉండరు. అతను చేస్తున్నది నమ్మశక్యంగా లేదు. అతనికి ఇంకా 25 ఏళ్ల కెరీర్ మిగిలి ఉందని ఊహించుకుంటేనే భయంగా ఉంది. భవిష్యత్తులో అతను మరింత మెరుగవుతాడు. మరింత బలంగా తయారవుతాడు" అని చెప్పుకొచ్చాడు.



# 'కొత్త సిక్సర్ల మెషిన్' వైభవ్.. కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు

- ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ
- ఒకే సీజన్‌లో 65 సిక్సర్లతో క్రిస్ గేల్ రికార్డు బ్రేక్
- వైభవ్ ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్ అంటూ యూనివర్సల్ బాస్ ప్రశంస
- ఎలిమినేటర్‌లో 29 బంతుల్లో 97 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్

**మనసులోమాట:**

ఐపీఎల్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కొత్త చరిత్ర సృష్టించాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) తరఫున ఆడుతున్న 15 ఏళ్ల యువ బ్యాటర్.. టీ20 క్రికెట్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. 334కు పైగా స్ట్రైక్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 65 సిక్సర్లు కొట్టిన వైభవ్, 2012లో క్రిస్ గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ఇది ఏ టీ20 టోర్నమెంట్‌లోనైనా ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు కావడం విశేషం.

వైభవ్ ప్రదర్శనపై క్రిస్ గేల్ స్వయంగా స్పందించి ప్రశంసలు కురిపించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులో.. "అద్భుతం వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్" అని అభినందించాడు. కేవలం 3 పరుగుల తేడాతో శతకం చేజార్చుకోవడంపై స్పందిస్తూ.. "నువ్వు దురదృష్టవంతుడివి. కానీ, కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు" అని ప్రోత్సహించాడు.

**ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల కింగ్.. వైభవ్ సూర్యవంశీ!**

ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మొత్తం 15 ఇన్నింగ్స్‌లలో 45.33 సగటు, 242.85 స్ట్రైక్ రేట్‌తో 680 పరుగులు సాధించాడు. ఇందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. తన పరుగుల్లో 88.9 శాతాన్ని కేవలం ఫోర్లు, సిక్సర్లతోనే సాధించి, 2019లో ఆండ్రీ రస్సెల్ (85.5%) నెలకొల్పిన రికార్డును కూడా వైభవ్ బద్దలు కొట్టాడు. అంతేగాక ఒకే ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో 10కి పైగా సిక్సర్లు బాదిన సందర్భాల్లో గేల్ (4 సార్లు) రికార్డును సమం చేయడమే కాకుండా, ఒకే సీజన్‌లో మూడుసార్లు ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అసాధారణ ప్రతిభతో, వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్ భవిష్యత్తుకు ఓ కొత్త ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.



# 15 ఏళ్లకే కోట్లకు పడగెత్తిన వైభవ్... ఆస్తి ఎంతో తెలుసా?

- 15 ఏళ్లకే క్రికెట్‌లో సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీ
- రూ.10 కోట్లకు పైగా చేరిన నికర ఆస్తి
- ముంబైలో ఖరీదైన ఫ్లాట్, లగ్జరీ కార్లు, కోట్ల రూపాయల కాంట్రాక్టులు
- స్పాన్సర్‌షిప్‌ల ద్వారా భారీగా పెరుగుతున్న సంపాదన

**మనసులోమాట:**

ప్రస్తుతం భారత క్రికెట్ ప్రపంచంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగిపోతోంది. ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) తరఫున సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) పై కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అతని సంపాదన, నికర ఆస్తిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చిన్న వయసులోనే ఈ యువ కెరటం రూ.10 కోట్లకు పైగా ఆస్తిని కూడబెట్టడం విశేషం.

**ఐపీఎల్ ద్వారా కోట్ల ఆదాయం**

2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేసింది. రెండో ఏడాది కూడా అదే మొత్తాన్ని జీతంగా అందుకుంటున్నాడు. దీంతో రెండేళ్లలో అతని ఐపీఎల్ జీతం రూ.2.2 కోట్లకు చేరింది. దీనికి అదనంగా ఆడిన ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు ఆడిన వైభవ్‌కు కేవలం మ్యాచ్ ఫీజుల రూపంలోనే సుమారు రూ.1.65 కోట్లు అందాయి. అతని అద్భుత ఆటతీరు చూస్తుంటే, వేలంలో చెల్లించిన మొత్తం చాలా తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆస్తులు.. ఖరీదైన బహుమతులు**

క్రికెట్ ఆదాయంతో పాటు వైభవ్‌కు విలువైన ఆస్తులు కూడా ఉన్నాయి. ముంబైలో సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువ చేసే విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను అతను కొనుగోలు చేశాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్‌లో ఉన్న అతని పూర్వీకుల ఇంటి విలువ కూడా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా.

2025 ఐపీఎల్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్ సాధించినందుకు బహుమతిగా రూ.17 లక్షల విలువైన టాటా కర్వ్ ఈవీ కారును గెలుచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రంజిత్ బర్తకూర్ అతనికి మెర్సిడెస్ బెంజ్ కారును బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. 2026 అండర్19 ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు అప్పటి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి రూ.50 లక్షల నగదు బహుమతి కూడా అందుకున్నాడు.




**స్పాన్సర్‌షిప్‌లతో రెట్టింపు ఆదాయం**

ఐపీఎల్ జీతం, మ్యాచ్ ఫీజులు, ఆస్తులు, బహుమతుల విలువ కలిపి సుమారు రూ.7 కోట్లుగా ఉన్నప్పటికీ, వైభవ్‌కు పెరుగుతున్న స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు అతని నికర ఆస్తిని గణనీయంగా పెంచుతున్నాయి. వివిధ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరించడం ద్వారా వస్తున్న ఆదాయంతో అతని మొత్తం నికర ఆస్తి విలువ రూ.10 కోట్లు దాటి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఈ స్థాయిలో సంపాదించడం అతని ప్రతిభకు, భవిష్యత్తుకు నిదర్శనంగా నిలుస్తోంది.

# అసలు రాజస్థాన్ జట్టులోకి వైభవ్ సూర్యవంశీ ఎలా వచ్చాడో తెలుసా?.. ఆ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఇదే!

- దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ ప్రతిభను గుర్తించిన ఆర్‌ఆర్ స్కౌట్ సమర్ ఖాద్రీ
- ఆర్‌ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా ఏర్పాటు చేసిన ట్రయల్స్‌కు హాజరైన వైభవ్
- ట్రయల్స్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచిన వైనం
- వైభవ్‌ను 'జనరేషనల్ టాలెంట్' అని అభివర్ణించిన జుబిన్
- అతని కోసం రూ.10 కోట్లు సిద్ధం చేయాలని ఆర్‌ఆర్ యాజమాన్యానికి మెసేజ్

**మనసులోమాట:**

ఐపీఎల్‌లో కొత్త ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంలో రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) జట్టు ఎప్పుడూ ముందుంటుంది. సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ వంటి ఎందరో యువ సంచలనాలను వెలుగులోకి తెచ్చిన ఆర్‌ఆర్... తాజాగా మరో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఎలా గుర్తించిందనే ఆసక్తికర కథనం వెలుగులోకి వచ్చింది.

రాజస్థాన్ రాయల్స్ స్కౌటింగ్ బృందంలో సభ్యుడైన సమర్ ఖాద్రీ, దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ ఆటను తొలిసారి గమనించాడు. ఓ లోకల్ మ్యాచ్‌లో వైభవ్ అమాంతం వరుస సిక్సర్లు బాదాడం చూశాడు. అతని అసాధారణ ప్రతిభకు ముగ్ధుడయ్యాడు. ఈ విషయాన్ని వెంటనే ఆర్‌ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో జుబిన్, వైభవ్ కోసం ప్రత్యేకంగా ఒక ట్రయల్ ఏర్పాటు చేశాడు.

ఈ ట్రయల్స్‌లో ఊహించని సంఘటన చోటు చేసుకుంది. వైభవ్ ఎదుర్కొన్న మొట్టమొదటి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ కూడా ఆర్‌ఆర్ ట్రయల్స్‌లో తమ తొలి బంతికే సిక్సర్లు బాదడం విశేషం. ఈ అద్భుతమైన ప్రదర్శన చూసి జుబిన్ భరుచా అవాక్కయ్యాడు. వెంటనే అతను ఆర్‌ఆర్ యాజమాన్యానికి ఒక సందేశం పంపాడు.




"వేలానికి రూ. 10 కోట్లు సిద్ధం చేయండి. మన ముందుకు ఒక 'జనరేషనల్ టాలెంట్' వస్తున్నాడు" అని అందులో పేర్కొన్నాడు. ఈ ఒక్క సంఘటనతో వైభవ్ ప్రతిభపై ఆర్‌ఆర్ యాజమాన్యానికి ఎంతటి నమ్మకం ఏర్పడిందో స్పష్టమవుతోంది.

# ఐపీఎల్ ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ ఘోర పరాజయం.. మైదానంలో కన్నీరు పెట్టుకున్న కావ్య మారన్!

- ఐపీఎల్ 2026 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఔట్
- ఎలిమినేటర్‌లో రాజస్థాన్ చేతిలో ఘోర పరాజయం
- సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్, ఆర్చర్ బౌలింగ్‌కు ఎస్‌ఆర్‌హెచ్ కుదేలు
- కావ్య గత ప్రవర్తనను గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో ట్రోలింగ్

**మనసులోమాట:**

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ప్రయాణం ముగిసింది. బుధవారం ముల్లాన్‌పూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఘోర పరాజయం పాలైంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ.. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు ఓటమిని తట్టుకోలేక ఎస్‌ఆర్‌హెచ్ యజమాని కావ్య మారన్ మైదానంలోనే కన్నీటిపర్యంతమయ్యారు.



ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి సన్‌రైజర్స్ బౌలింగ్‌ను ఛిన్నాభిన్నం చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యూహాలేవీ అతడి ముందు ఫలించలేదు.

అనంతరం 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌ను రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన పేస్ బౌలింగ్‌తో దెబ్బతీశాడు. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి హైదరాబాద్ ఒత్తిడిలో పడింది. నితీశ్‌రెడ్డి (38) కాసేపు పోరాడినా ఫలితం లేకపోయింది. చివరికి 192 పరుగులకే పరిమితమై ఎస్‌ఆర్‌హెచ్ ఓటమిని అంగీకరించింది.

కాగా, ఈ ఓటమి తర్వాత కావ్య మారన్‌పై సోషల్ మీడియాలో, ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ (CSK) అభిమానుల నుంచి ట్రోలింగ్ మొదలైంది. లీగ్ దశలో చెన్నైపై గెలిచినప్పుడు కావ్య అతిగా సంబరాలు చేసుకున్నారని, "గెలిచినప్పుడు వినయంగా ఉండాలి" అంటూ పాత వీడియోలను షేర్ చేస్తూ చురకలు అంటిస్తున్నారు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్ ఇలా అనూహ్యంగా టోర్నీ నుంచి వైదొలగడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!



వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది

# ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపంచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.




# 'పెద్ది' పైరసీకి అడ్డుకట్ట.. మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు

'పెద్ది' సినిమా పైరసీకి అడ్డుకట్ట వేసేందుకు మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు యాంటీపైరసీ ఇంజంక్షన్ జారీ చేసింది. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాను (Peddi) ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. సినిమా అనధికారికంగా ఇంటర్నెట్‌లో లీక్ అయితే నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుందని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

'యాంటీ పైరసీ ఇంజంక్షన్' (AntiPiracy Injunction) అనేది కాపీరైట్ హక్కుదారులు తమ కంటెంట్ (సినిమాలు, వెబ్‌సిరీస్‌లు) అక్రమంగా కాపీ కాకుండా, పైరసీ వెబ్‌సైట్లలో ప్రసారం కాకుండా కోర్టుల ద్వారా పొందే ఒక న్యాయపరమైన రక్షణ ఉత్తర్వు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే, కొత్త యూఆర్ఎల్‌తో అదే కంటెంట్ రాకుండా కొత్త సైట్‌లను కూడా ఆటోమెటిక్‌గా బ్లాక్ చేయడానికి ఈ 'డైనమిక్ ఇంజంక్షన్' (Dynamic Injunction) ఉత్తర్వులను కోర్టులు జారీ చేస్తుంటాయి.

గతకొంత కాలంగా ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా విజయ్ 'జననాయగన్' విడుదలకు ముందే నెట్టింట ప్రత్యక్షమైంది. ఇలాంటివి జరగకుండా 'పెద్ది' టీమ్ ముందడుగు వేయడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామ్ చరణ్ (Ram Charan) హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు దీనిపై అంచనాలు పెంచేశాయి.






## స్వాతంత్ర్య దినోత్సవం స్పెషల్‌గా రాబోతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'..

తమిళ స్టార్ హీరో సూర్య తన కెరీర్‌లో తొలిసారిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో పూర్తి స్థాయి తెలుగు చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో మమితా బైజు హీరోయిన్ కాగా.. రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ఫిక్స్ చేస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రియమైన అభిమానులారా.. ఈ వేడుకలను ఇలాగే కొనసాగించడానికి మా దగ్గర అదిరిపోయే అప్డేట్ ఉన్నది. విశ్వనాథ్ అండ్ సన్స్ కోసం దారి ఇవ్వండి.. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్లను జయించడానికి వస్తున్నారు' అంటూ అదిరిపోయే పోస్టర్‌ను షేర్ చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో సూర్య చేతిలో గొడుగు, ఫోన్ పట్టుకుని సీరియస్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అలాగే వీకెండ్స్ కావడంతో ఈ సెలవులు సినిమా సక్సెస్‌కు మరింత ప్లెస్ అయ్యే అవకాశం ఉన్నట్లు ఖుష్ అవుతున్నారు అభిమానులు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకోవడంతో పాటు.. తెలుగులో సూర్య మొదటి చిత్రం కావడంతో ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



# 'ఎల్లమ్మ' కోసం యంగ్ సెన్సేషన్?

'బలగం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. దీంతో టాలీవుడ్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దిల్ రాజు ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ మాత్రం ఇంకా ఫైనల్ కాలేదు. గతంలో పలువురు ముద్దుగుమ్మల పేర్లు వినిపించగా.. కీర్తి సురేష్ ఆల్మోస్ట్ ఫైనల్ అయిందని అన్నారు. ఇటీవల మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. 'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్.. ఈ ఎమోషనల్ రోల్‌కు పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందని మేకర్స్ భావించారు. దీనిపై ఆమెతో చర్చలు కూడా జరిగాయని అన్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రెస్టేజీయస్ ప్రాజెక్ట్‌లో యంగ్ సెన్సేషన్ మమితా బైజు పేరు వినిపిస్తోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యంగ్ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ప్రాజక్ట్‌స్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో.. ఎల్లమ్మలో మమిత ఛాన్స్ దక్కించుకున్నట్టుగా సమాచారం. ప్రస్తుతానికి మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు టాక్. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే, డీఎస్‌పీ సరసన మమితా బైజు జోడీ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాత్రం ఎల్లమ్మ ఎవరు అనేది సస్పెన్స్‌లోనే ఉంది.



# వారణాసి కోసం మహేష్ భారీ రిస్క్.. ఏకంగా నెల రోజుల పాటు నరకమే !

ప్రిన్స్ మహేష్ బాబు లేటెస్ట్ గా నటిస్తున్న సినిమా వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ మూవీ.. టైం ట్రావెల్, మైథాలజీ కాన్సెప్ట్ తో వస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా టైటిల్ టీజర్ రిలీజ్ కాగా, అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం శరావేగంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

ఇలాంటి క్రమంలో ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా షూటింగ్ లో భాగంగా వచ్చే నెల మొదటి వారం నుంచి ఓ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కాబోతుందట. ఈ 30 రోజుల పాటు నాన్ స్టాప్ గా యాక్షన్స్ షూట్ జరగనున్నట్లు టాక్ నడుస్తోంది. ప్రతిరోజు మహేష్ బాబు హాజరు కాబోతున్నట్లు సమాచారం. అంటే ఈ నెల రోజుల పాటు మహేష్ బాబు యాక్షన్ మోడ్ లో ఉంటాడన్నమాట. ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలెట్ గా నిలుస్తుందని కూడా అంటున్నారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

# ఫ్యాన్స్ వార్ సృష్టించడం వల్ల జరిగేదేం ఉండదు..

సెలబ్రిటీలకు ఫ్యాన్స్ ఉండటం చాలా కామన్. అయితే.. కొందరు ఫ్యాన్స్ మాత్రం మా హీరో / హీరోయిన్ గొప్పా అంటే మా వాళ్లు గొప్పా అంటూ సోషల్ మీడియాలో వార్ సృష్టిస్తుంటారు. తాజాగా ఇలాంటి సంఘటనే బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలాకు ఎదురైంది. ఏఐ ద్వారా సృష్టించిన ఓ ఫొటోలో ఐశ్వర్యరాయ్‌ను గ్లోబల్ బ్యూటీగా, ఆ తర్వాత కేటగిరిలో దీపిక పదుకొణె, ప్రియాంక చోప్రా, మాధురీ దీక్షిత్ ఉన్నారు. ఇక వాళ్ల ముందు మోకరిల్లి పాదాలు నమస్కరిస్తున్నట్లుగా నటి ఊర్వశితో పాటు ఆలియా భట్, కరీనా కపూర్, కత్రినా కైఫ్ ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏఐ ఫొటో వైరల్ అవుతుండగా ఊర్వశి దానిపై ఘాటుగా స్పందించింది. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేస్తూ.. 'ప్రతి నటికి తనకంటూ సొంత జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో ఎంతో కష్టపడుతుంది. అలాంటి మహిళల్ని పోలుస్తూ ఫ్యాన్ వార్ సృష్టించడం వల్ల జరిగేది ఏం ఉండదు. అది కేవలం నెగిటివిటీని వ్యాప్తిచేయడం మాత్రమే అవుతుంది. దానికి బదులుగా టాలెంట్‌ను గుర్తించండి, వారి ఎదుగుదలను ప్రోత్సహించండి. దయతో ప్రవర్తించడం నేర్చుకోండి. ఇలా విషం చిమ్మడం ఆపేయండి' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె పోస్ట్ వైరల్ అవుతుండగా.. తనకు సపోర్ట్‌గా నిలిస్తూ.. 'ఎవరి ప్రతిభ వాళ్లది.. ఎవరిని కించపరచొద్దు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# పెట్రో ధరలపై వామపక్షాల పోరు

## రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం

## జూన్ 1 నుంచి 7 వరకు ప్రజా చైతన్య కార్యక్రమాలు




**విజయవాడ, మే 28:** పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని వామపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. పెరుగుతున్న ఇంధన ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించాయి. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల వల్లే ఇంధన ధరలు అమాంతం పెరుగుతున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 1 నుంచి 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇదే సందర్భంగా పాసర్లపూడి కేజీ బేసిన్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో ప్రచారం చేస్తున్నారని, కానీ ధరల పెరుగుదలతో ఎంతమంది ఉపాధి కోల్పోయారో వెల్లడించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం పొదుపు చర్యల పేరుతో ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేసిన వామపక్ష నేతలు.. ఇప్పుడు ఆ హామీల అమలుపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ధరలు తగ్గించకపోవడం ఏమిటని నిలదీశారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తక్షణమే తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. మహానాడులోనే ఇంధన ధరల తగ్గింపుపై తీర్మానం చేయాలని కోరాయి. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే వనరుల్లో 50 శాతం రాష్ట్ర ప్రజల అవసరాలకు వినియోగించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. కమర్షియల్ గ్యాస్ ధరలను పాత ధరలకే అందించాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రజలకు ఊరట కలిగించే చర్యలు చేపట్టాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

# మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు

- టీడీపీపై మాజీ మంత్రి రోజా విమర్శలు
- 'చెప్పుల పార్టీ.. వెన్నుపోటు పార్టీ.. దొంగల పార్టీ' అంటూ ధ్వజం




**తిరుపతి, మే 28:** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లపై ఘాటు విమర్శలు చేశారు. టీడీపీ ఒక "బోగస్ పార్టీ" అంటూ వ్యాఖ్యానించిన రోజా.. ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెబుతున్నప్పటికీ మహానాడులో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయిందని, అందుకే రికార్డ్ డ్యాన్సులు పెట్టి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన రోజా.. సూపర్ సిక్స్ హామీలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన తల్లి, చెల్లికి హెరిటేజ్ ఆస్తుల్లో ఎంత భాగం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేసిన రోజా.. "వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా?" అని ప్రశ్నించారు. జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు దేశంలో మరెవ్వరూ ఇవ్వలేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే ఆ హత్య జరిగిందని, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు తరఫున కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి కూడా లాయర్‌గా ఉన్నారని అన్నారు. టీడీపీని "చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ" అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారు.. వెన్నుపోటు పొడిచారు.. పార్టీని దొంగతనంగా లాక్కొన్నారు" అంటూ ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై స్పందించిన రోజా.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, కానీ అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని విమర్శించారు. టీడీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహానాడులో మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలని సవాల్ విసిరారు. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా అని ప్రశ్నించారు. జగన్ ఇప్పటికే 2023లో అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే టీడీపీ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు ప్రభుత్వం అడ్డదిడ్డంగా పెంచుతోందని విమర్శించిన రోజా.. "పేదలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్పే చంద్రబాబు, తన కుటుంబంలో మాత్రం ఒక్కో పిల్లవాడినే కనారు" అంటూ ఎద్దేవా చేశారు. లోకేష్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేసిన రోజా.. "జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని, వల్లభనేని వంశీ వస్తే భయపడి పారిపోయిన వ్యక్తి లోకేష్" అని విమర్శించారు. జగన్ పీఏ కేఎన్ఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్నారని, వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు.

# జగన్ పీఏ కేఎన్ఆర్ నివాసంలో సిట్ తనిఖీ

## మద్యం కుంభకోణం దర్యాప్తులో ముమ్మర చర్యలు



**విజయవాడ, మే 28 :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. వైసీపీ అధినేత జగన్ వ్యక్తిగత సహాయకుడు కె నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్) నివాసంలో గురువారం అధికారులు సోదాలు చేపట్టారు. విజయవాడలోని ఆయన ఇంట్లో మద్యం లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు సిట్ కార్యాలయంలో కేఎన్ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి ప్రశ్నలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా దాదాపు 9 గంటలకుపైగా విచారణ జరిపిన అధికారులు, పలువురు అంశాలపై వివరాలు సేకరించినట్లు సమాచారం. విచారణలో కేఎన్ఆర్ ఇచ్చిన సమాధానాల్లో పొంతన లేదని తెలుస్తోంది. దర్యాప్తులో కేఎన్ఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించిన కీలక విషయాలు బయటపడినట్లు సమాచారం. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించిన అధికారులు, 2019 నుంచి 2024 మధ్య ఆమె బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇవేకాక విజయవాడలో కార్ల షోరూంలో వాటాలు, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కేఎన్ఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో భారీగా ఆస్తులు కూడబెట్టిన కోణంలో సిట్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏపీ మద్యం కుంభకోణం కేసులో విజయసాయిరెడ్డి విచారణ

## ఏడున్నర గంటల పాటు ఈడీ ప్రశ్నలు



**హైదరాబాద్, మే 28 :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఈడీ అధికారులు సుమారు ఏడున్నర గంటల పాటు విచారించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో గురువారం ఆయనను ప్రశ్నించారు. విచారణ అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ఎవరి పేర్లను అధికారులకు చెప్పలేదని, రాజ్ కెసిరెడ్డి పేరు మాత్రమే ప్రస్తావించానని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన పూర్తి సమాచారం రాజ్ కెసిరెడ్డికే తెలుసని అధికారులకు చెప్పినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని చెప్పారు. పెద్దగా ప్రశ్నలు జరగలేదని, తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్‌ఫర్ కోసం పిలిచినట్లు పేర్కొన్నారు. అధికారులకు అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉండొచ్చనే ఉద్దేశంతో డేటాను తీసుకున్నారని తెలిపారు. మద్యం పాలసీ కుంభకోణం ఎలా జరిగింది, దానిలో ఏం జరిగిందనే విషయాలు రాజ్ కెసిరెడ్డికే తెలుసని మళ్లీ స్పష్టం చేశారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా తాను ఇదే విషయాన్ని చెప్పినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని అన్నారు.



# రెండో రోజు పోలవరంలో బెర్గర్ బృందం పర్యటన

**పోలవరం, మే 28 :** పోలవరం ప్రాజెక్ట్‌లో విదేశీ నిపుణుడు సీన్ హించి బెర్గర్ రెండో రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఆ తరువాత సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. తొలి రోజు డయాఫ్రమ్ వాల్ గ్యాప్ 1, 2 లను పరిశీలించిన ఆయన రెండో రోజు ఎర్త్ కం రాక్ ఫిల్ (ఈసిఆర్‌ఎఫ్ ) డ్యామ్ నిర్మాణంలో ఉపయోగించే బంకమట్టిపై కేంద్రీకరించారు. సుమారు గంటసేపు ఆయన మట్టి నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ మట్టిని ఎక్కడి నుంచి సేకరించారో అడిగి తెలుసుకున్నారు. వినియోగానికి ముందు నిర్వహించిన పరీక్షల గురించి ఆరా తీశారు. తాము అన్ని పరీక్షలు నిర్వహించిన తరువాతే మట్టిని వినియోగిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ మట్టి, పదార్థాల పరిశోధనా సంస్థ ధ్రువీకరణ చేసిన తరువాత వినియోగిస్తున్నామని, అంతకు ముందు అంతర్గతంగా కూడా పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం కేంద్ర జల వనరుల సంఘం చీఫ్ ఇంజనీర్ సరబ్జిత్ సింగ్ బక్షి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో సిడబ్ల్యూసీ డైరెక్టర్ మనీష్ రాథోర్, ఉప సంచాలకులు అశ్వనీ కుమార్ వర్మ, గౌరవ్ తివారీ , జలవనరుల శాఖ ఉప కమిషనర్ గౌరవ్ సింఘాయ్, కేంద్ర మట్టి, పదార్థాల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సచిన్ గుప్త, రవి అగర్వాల్ , పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సంజీవ్ వోహ్రా, సభ్య కార్యదర్శి ఎం రఘురామ్, చీఫ్ ఇంజనీర్ ఎం రమేష్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, ఈఎన్సి కే నరసింహ మూర్తి, ఎస్‌ఈ ఆర్ రామచంద్ర రావు, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) చీఫ్ జనరల్ మేనేజర్ రఫీ, పోలవరం ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్ , డెప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సి ఆర్ ఎఫ్ లో బంకమట్టి వినియోగం, జి ఒజి హిల్ పటిష్ట పరచటానికి నిర్మిస్తున్న గోడ, నిల్వ నీటిని తోడేందుకు నిర్దేశించిన ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా బెర్గర్, కేంద్ర జల సంఘం అధికారులు అడిగిన సందేహాలను రాష్ట్ర జలవనరుల శాఖ, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులు నివృత్తి చేశారు.

## ముగిసిన సిఎస్ఎంఆర్ఎస్ బృందం పర్యటనలి

కేంద్ర మట్టి, పదార్థాల పరిశోధనా సంస్థ (సి ఎస్ ఎం ఆర్ ఎస్) బృందం పోలవరం ప్రాజెక్ట్ లో నిర్వహిస్తున్న పరీక్షలు గురువారంతో ముగిసాయి. ప్రాజెక్టులో ఈ సి ఆర్ ఎఫ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో సి ఎస్ ఎం ఆర్ ఎస్ నిపుణులు సిద్దార్థ్ పీ హెడవూ, శ్రీ హరి టి నాయర్, గౌరవ్ పాండే తమ పరీక్షలు కొనసాగించారు. గురువారం కూడా వీరు గ్యాప్ 2 ప్రాంతంలో పరీక్షలు నిర్వహించారు. నీటి ప్రవాహం ఉన్నపుడు రాళ్లు పరిచిన ప్రాంతం తట్టుకోగలదా లేదా అని ప్రధానంగా పరీక్షించారు. మట్టి, ఇసుక వినియోగించిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా పరీక్షలు కొనసాగాయి. సి ఎస్ ఎం ఆర్ ఎస్ బృందం నిర్వహించిన పరీక్షల్లో జలవనరుల శాఖ డి ఈ లు డి శ్రీనివాస్, శ్రీకాంత్, విజయ్ కుమార్, ఎం ఈ ఐ ఎల్ పోలవరం ప్రాజెక్ట్ జి ఎం ఏ గంగాధర్, డి జి ఎం లు మురళి పమ్మి, గుట్టపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఉన్నారు.

# అమెరికాలో తెలుగు యువకుడు మృతి

## పెళ్లికి నెల రోజుల ముందే గుండెపోటుతో కన్నుమూత

**ఏలూరు, మే 28 :** ఉన్నత భవిష్యత్తు కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు యువకుడు ఆకస్మికంగా మృతి చెందాడు. వచ్చే నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా గుండెపోటుతో కన్నుమూయడం ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన అమెరికాలోని వెర్మాంట్ రాష్ట్రం బర్లింగ్టన్‌లో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఏలూరుకు చెందిన నితిన్ రెడ్డి గోపిరెడ్డి ఉపాధి నిమిత్తం అమెరికాలో నివసిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. నితిన్ రెడ్డికి జూన్‌లో వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సి ఉండగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఇటీవల నితిన్ రెడ్డి ఉద్యోగం కోల్పోయినట్లు తెలుస్తోంది. పెళ్లి సమీపిస్తున్న సమయంలో ఉద్యోగం పోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఆ ఆందోళన గుండెపోటుకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. కాబోయే భర్త మృతి వార్తతో వధువు కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. పెళ్లి ఏర్పాట్లలో ఉన్న నితిన్ రెడ్డి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఇమేజ్ డ్యామేజ్‌కే ఈడీ దాడులు

**అమరావతి,మే 28:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఈడీ అధికారుల దాడులపై ఏపీ సీపీఐ నేత రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. దాడులను ఖండించిన ఆయన... సోదాలు నిర్వహించిన అధికారులు ఒట్టి చేతులతోనే వెనక్కి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న విజయన్ కు ప్రజల్లో మంచి ఇమేజ్ ఉందని... ఆ ఇమేజ్ డ్యామేజ్ చేసేందుకే ఈడీ దాడులు జరిగాయని రామకృష్ణ విమర్శించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు, అక్రమ కేసులు సాధారణమై పోయాయని దుయ్యబట్టారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా విషయంలో కూడా ఇదే జరిగిందని రామకృష్ణ అన్నారు. బీజేపీ కండువా కప్పుకునే వారు ఎవరైనా సరే వారిపై ఎలాంటి దాడులు జరగవని చెప్పారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, బెంగాల్ సీఎం సువేందు అధికారిపై కూడా గతంలో మోదీ ఆరోపణలు చేశారని... అయితే, వారు బీజేపీలో చేరడంతో వాళ్లపై ఎలాంటి చర్యలు లేవని మండిపడ్డారు. కేవలం ప్రతిపక్ష నేతలపై మాత్రమే ఒక పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు.



# పసిడి, వెండి ధరలకు భారీ షాక్..

**హైదరాబాద్, మే 28 :** అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ ధరలు తగ్గడం, డాలర్ బలపడటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయన్న సంకేతాలతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు పుంజుకోవడంతో మదుపరులు సురక్షిత పెట్టుబడులైన బంగారం వైపు ఆసక్తి తగ్గించినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గురువారం ఉదయం పరిస్థితి ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,060గా నమోదైంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే రూ.2,230 మేర తగ్గడం విశేషం. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,43,050కు చేరుకుంది. ఈ విభాగంలో కూడా రూ.2,050 మేర తగ్గుదల కనిపించింది. మరోవైపు వెండి ధరల్లోనూ భారీ పతనం నమోదైంది. ఒక్కరోజులోనే కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల మేర పడిపోయింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,85,000గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,75,000గా ఉండగా.. చెన్నైలో రూ.2,85,000, బెంగళూరులో రూ.2,75,000గా నమోదైంది. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు, ముడి చమురు ధరల మార్పులు వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులను బట్టి ధరల్లో మరింత మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# హెల్మెట్లు, అంబులెన్స్‌లపై జీఎస్టీ తగ్గించాలి




**న్యూఢిల్లీ, మే 28 :** హెల్మెట్లు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై ప్రస్తుతం అమలులో ఉన్న వస్తు సేవల పన్ను తగ్గించాలని లేదా పూర్తిగా రద్దు చేయాలని గ్లోబల్ రోడ్ సేఫ్టీ సంస్థ ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేసింది ఈ మేరకు ఐఆర్ఎఫ్ గౌరవ అధ్యక్షుడు కేకే కపిల ప్రధానికి లేఖ రాశారు. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, అయితే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడడంలో హెల్మెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై కూడా జీఎస్టీ భారాన్ని తొలగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్సిజన్ సాంద్రీకరణ యంత్రాలు, మానిటర్లు, వీల్‌చైర్లు, ఇంప్లాంట్లు, ఇతర అత్యవసర ఆరోగ్య పరికరాలపై పన్ను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత, అత్యవసర వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే ఈ నిర్ణయం అవసరమని ఐఆర్ఎఫ్ అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించేందుకు భద్రతా పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమని సంస్థ పేర్కొంది.

# మెటా కొత్త పెయిడ్ ప్లాన్లు

## ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో ప్రత్యేక ఫీచర్లు

**న్యూఢిల్లీ, మే 28 :** ప్రపంచ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా వినియోగదారుల కోసం కొత్త పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికలపై ప్రత్యేక ఫీచర్లు అందించేలా ఈ చెల్లింపు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ప్లాన్లు ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్టోరీలు, ప్రొఫైళ్లు, చాట్‌లు, రియాక్షన్‌లు, పోస్టులపై మరింత నియంత్రణ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను రూపొందించినట్లు మెటా వెల్లడించింది. క్రియేటర్లు, వ్యాపార సంస్థలు, కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా వినియోగించే వారికోసం 'మెటా వన్' పేరుతో ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ సేవలను కూడా తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇవి 'మెటా వెరిఫైడ్' సేవలకు భిన్నంగా పనిచేస్తాయని సంస్థ తెలిపింది. ఫేస్‌బుక్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ ప్లాన్ల ధరను నెలకు 3.99 డాలర్లుగా నిర్ణయించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.362 వరకు ఉంటుంది. ఇక వాట్సాప్ ప్లస్ ధర నెలకు 2.99 డాలర్లు కాగా, భారత కరెన్సీలో దాదాపు రూ.271గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ వినియోగదారులకు ప్రత్యేక స్టోరీ నియంత్రణలు, స్టోరీలను మళ్లీ చూసిన వారి వివరాలు తెలుసుకునే అవకాశం, వీక్షకుల జాబితాలో శోధన సదుపాయం, స్టోరీలను 24 గంటలకు మించి పొడిగించే అవకాశం వంటి ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. అదనంగా వారానికి ఒకసారి స్టోరీని ప్రత్యేకంగా ప్రోత్సహించే సదుపాయం కూడా కల్పించారు. ఇక మెటా వన్ ప్లస్ ప్లాన్ ధర నెలకు 7.99 డాలర్లు కాగా, మెటా వన్ ప్రీమియం ప్లాన్ ధర నెలకు 19.99 డాలర్లుగా ఉంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.725 నుంచి రూ.1,814 వరకు ఉంటుంది. ఈ ప్రీమియం ప్లాన్లలో అధునాతన కృత్రిమ మేధ ఫీచర్లు, మరిన్ని ఫొటోలు, వీడియోలు రూపొందించే సదుపాయాలు, లోతైన విశ్లేషణ సామర్థ్యాలు లభించనున్నాయి. సాధారణ వినియోగదారులకు మెటా ఏఐ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని సంస్థ స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఓటీటీలు, సంగీత యాప్‌లు, క్లౌడ్ స్టోరేజ్, ఫుడ్ డెలివరీ సభ్యత్వాల కోసం చెల్లింపులు చేస్తున్న వినియోగదారులకు ఈ కొత్త ప్లాన్లు అదనపు ఆర్థిక భారంగా మారే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు షాక్

**న్యూఢిల్లీ, మే 28 :** ప్రపంచంలోని అత్యంత విలువైన స్టాక్ మార్కెట్ల జాబితాలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చిన్న దేశమైన తైవాన్ తాజాగా భారత్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం భారత జనాభా 147 కోట్లకు పైగా ఉన్నప్పటికీ, దేశీయ పెట్టుబడిదారుల సంఖ్య మాత్రం ఇంకా పరిమితంగానే ఉండటం మార్కెట్ విస్తరణపై ప్రభావం చూపుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య ప్రస్తుతం 13 కోట్లకు పైగానే ఉంది. అయితే భారత్ కంటే ఎంతో చిన్న దేశమైన తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ మాత్రం వేగంగా పెరుగుతోంది. బుధవారం ట్రేడింగ్‌లో తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెయిటెడ్ ఇండెక్స్ 1.68 శాతం పెరగడంతో అక్కడ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇక భారత ఎన్ఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.92 లక్షల కోట్ల డాలర్ల వద్ద నిలిచింది. దీంతో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం అమెరికా 77.95 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత చైనా 17.75 లక్షల కోట్ల డాలర్లు, జపాన్ 8.7 లక్షల కోట్ల డాలర్లు, హాంకాంగ్ 7.25 లక్షల కోట్ల డాలర్లతో వరుసగా రెండో, మూడో, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. తైవాన్ మార్కెట్ దూసుకెళ్లడానికి ప్రధాన కారణం సెమీకండక్టర్, టెక్నాలజీ రంగాలే అని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ యుగంలో చిప్ తయారీ కంపెనీలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ పెరగడం తైవాన్‌కు కలిసివచ్చింది. తైవాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సెమీకండక్టర్ దిగ్గజం టీఎస్ఎంసీ ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ చిప్ తయారీ సంస్థగా ఉన్న ఈ కంపెనీ.. ఎన్విడియా, యాపిల్, ఏఎండీ, క్వాల్‌కామ్ వంటి అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాల కోసం అత్యాధునిక ఏఐ చిప్‌లను తయారు చేస్తోంది. గత ఏడాది కాలంలో టీఎస్ఎంసీ షేర్లు 130 శాతానికి పైగా పెరగడం, తైవాన్ ప్రధాన స్టాక్ సూచీ ఈ ఏడాదిలోనే 52 శాతానికి పైగా ఎగబాకడం అక్కడి మార్కెట్ విలువను భారీగా పెంచింది. మరోవైపు భారత్ స్టాక్ మార్కెట్ మాత్రం పలు అంతర్జాతీయ ఒత్తిళ్లతో కుదేలవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు భారత మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాదిలో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు 8 శాతానికి పైగా నష్టపోయాయి. దీంతో భారత మార్కెట్ విలువలో కూడా గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది.




# జూన్ నుంచి హ్యుందాయ్ కార్లు ఖరీదు

## కొనుగోలుదారులకు భారీ షాక్

**హైదరాబాద్, మే 28 :** సౌత్ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా.. కారు కొనుగోలుదారులకు షాకింగ్ న్యూస్ చెప్పింది. వచ్చే నెల జూన్ 1వ తేదీ నుంచి తమ కార్ల ధరలను పెంచనున్నట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి గరిష్టంగా రూ.12,800 వరకు ధరలు పెరగనున్నట్లు వెల్లడించింది. నిజానికి కార్ల ధరలను మే నెల నుంచే ఒక శాతం వరకు పెంచాలని హ్యుందాయ్ సంస్థ ఏప్రిల్‌లోనే ప్రకటించింది. అయితే కొన్ని అంతర్గత కారణాలతో ఆ నిర్ణయాన్ని జూన్‌కు వాయిదా వేసింది. ఇప్పుడు ఆ పెంపు అమల్లోకి రానుండటంతో కొత్త కారు కొనాలనుకునే వారికి అదనపు భారం తప్పదని తెలుస్తోంది. ఈ ధరల పెంపుకు గల కారణాలను కూడా కంపెనీ వివరించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆటోమొబైల్ రంగానికి అవసరమైన ముడిసరకుల ధరలు భారీగా పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికమవడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని హ్యుందాయ్ తెలిపింది. గత కొంతకాలంగా పెరుగుతున్న అదనపు భారాన్ని సంస్థే భరిస్తూ వచ్చిందని, కానీ ప్రస్తుతం పరిస్థితులు దృష్ట్యా ధరలు పెంచడం తప్పనిసరి అయిందని కంపెనీ పేర్కొంది. భారత మార్కెట్‌లో హ్యుందాయ్‌కు చెందిన క్రెటా, ఐ20, వెన్యూ, ఎక్స్టర్ వంటి మోడళ్లకు భారీ డిమాండ్ ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఈ కార్లను కొనుగోలు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు జూన్ 1కు ముందే బుకింగ్ పూర్తి చేస్తే ప్రస్తుతం ఉన్న ధరలకే వాహనం పొందే అవకాశం ఉండొచ్చని ఆటోమొబైల్ డీలర్లు సూచిస్తున్నారు.






# హైదరాబాద్‌లో ఈబీజీ గ్రూప్ భారీ విస్తరణ..

**హైదరాబాద్, మే 28 :** ఈబీజీ గ్రూప్ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో కొత్త తయారీ, అసెంబ్లింగ్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌ను ఏర్పాటు చేసింది. రూ.25 కోట్ల పెట్టుబడితో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ యూనిట్‌ను 'వజ్రం ఎలక్ట్రిక్' పేరుతో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇప్పటికే నగరంలో అడ్వాన్స్‌డ్ అసెంబ్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్న ఈబీజీ గ్రూప్.. ఇప్పుడు వ్యాపార విస్తరణలో మరో కీలక అడుగు వేసింది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, వ్యాపార కార్యకలాపాలను మరిన్ని రంగాలకు విస్తరించాలనే లక్ష్యంతో ఈ కొత్త యూనిట్‌ను ప్రారంభించినట్లు ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకుడు ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు. ప్రారంభ దశలోనే రూ.25 కోట్ల పెట్టుబడి పెట్టామని, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ కొత్త యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 450 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈబీజీ గ్రూప్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, నిర్మాణ రంగం, ఆహార మరియు పానీయాలు, మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగాల్లో సేవలు అందిస్తోంది. కొత్త యూనిట్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# పీఎఫ్ ఖాతాలో తప్పులా?

## ఇక ఇంట్లో నుంచే సులువుగా మార్చుకోండి

**న్యూఢిల్లీ, మే 28 :** ప్రైవేట్ ఉద్యోగులు తప్పనిసరిగా కలిగి ఉండే పీఎఫ్ ఖాతాలకు సంబంధించిన సేవలను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరింత సులభతరం చేసింది. ఇప్పుడు పీఎఫ్ ఖాతాలో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాల్లో పొరపాట్లు ఉన్నా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా సులువుగా సవరించుకునే అవకాశం కల్పిస్తోంది. చాలామంది ఖాతాదారులు పీఎఫ్ వివరాల్లో తప్పులు ఉంటే ఎలా మార్చుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈపీఎఫ్‌వో పోర్టల్ ద్వారా కొన్ని నిమిషాల్లోనే వివరాలను సవరించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

### ఏ వివరాలు మార్చుకోవచ్చు..?

పేరు, పుట్టిన తేదీ, లింగం, తండ్రి లేదా భర్త పేరు, వైవాహిక స్థితి, జాతీయత, పీఎఫ్‌లో చేరిన తేదీ, ఉద్యోగం వదిలిన తేదీ, ఈపీఎస్ జాయినింగ్, ఎగ్జిట్ తేదీలు వంటి అనేక వివరాలను ఆన్‌లైన్‌లో సవరించుకోవచ్చు.

### ఇలా మార్చుకోవాలి

ముందుగా ఈపీఎఫ్‌వో అధికారిక పోర్టల్‌లోకి వెళ్లాలి. అక్కడ సర్వీసెస్ విభాగంలో ఫర్ ఎంప్లాయీస్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తర్వాత యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి లాగిన్ కావాలి. ఓటీపీ ధృవీకరణ పూర్తయ్యాక మేనేజ్ విభాగంలో జాయింట్ డిక్లరేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థ వివరాలను ఎంపిక చేసి, గెట్ డీటైల్స్‌పై క్లిక్ చేస్తే ఖాతా సమాచారం కనిపిస్తుంది. అందులో సవరించాల్సిన వివరాన్ని ఎంపిక చేసి కొత్త సమాచారం నమోదు చేయాలి. అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేసిన తర్వాత సబ్మిట్ చేస్తే ప్రక్రియ పూర్తవుతుంది.

### అవసరమైన పత్రాలు

పేరు లేదా లింగం మార్చుకోవాలంటే ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాలు అవసరం. పుట్టిన తేదీ సవరణకు జనన సర్టిఫికేట్, టెన్త్ మెమో, ఆధార్ లేదా పాస్‌పోర్ట్ సమర్పించాలి. తండ్రి లేదా భర్త పేరు మార్చుకోవాలంటే మ్యారేజ్ సర్టిఫికేట్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ వంటి పత్రాలు అవసరం అవుతాయి. ఉద్యోగ సంస్థ వివరాలు మార్చాలంటే అపాయింట్‌మెంట్ లెటర్, రిలీవింగ్ లెటర్, ఈఎస్ఐసీ కార్డు వంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ సదుపాయం వల్ల ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే తమ పీఎఫ్ ఖాతా వివరాలను సులభంగా సవరించుకునే అవకాశం లభిస్తోంది.

